నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 4 : ప్రజాసమస్యల పరిష్కార వేదిక జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.అమరావతిలో ఈ నెల 5,6 తేదీల్లో సీఎం చంద్రబాబు జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహిస్తున్నందున పీజీఆర్ఎస్‌కు హాజరుకాలేనన్నారు. కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి జేసీ జి.నరసింహులు, ఇతర అధికారులు అర్జీలు స్వీకరిస్తారన్నారు.

మళ్లీ నీట మునిగిన శ్రీరంగపట్నం

కోరుకొండ, ఆగస్టు 4 : ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు కాలువలు పొంగుతున్నాయి.. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో వాగు లు, వంకల పొంగి పొర్లుతున్నాయి. దీంతో పెద్ద ఎత్తున వరదనీరు బురద కాలువకు చేరుతుంది. ఈ నేపథ్యంలో బురద కాలువ వరద నీరు శ్రీరంగపట్నం గ్రామంపై మరోసారి రోడెక్కింది. సూరంపాలెం రిజర్వాయర్ నుంచి మిగులు జలాలను బురద కాలువ నుంచి వదలడంతో ఆదివారం శ్రీరంగపట్నం గ్రామంలోని బురద కాలువ వరద నీరు రోడ్డెక్కింది. బురద కాలువ రోడ్డు ఎక్కే ప్రదేశంలో తాత్కాలికంగా ఇసుక బస్తాలను ఏర్పాటు చేశారు.ఈ మేరకు సమాచారం అందుకున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ హుటాహుటిన శ్రీరంగపట్నం చేరుకుని వరదనీటిని పరిశీలించారు.తగిన సహాయ చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్, రెవె న్యూ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. సర్పంచ్ మద్దాల రమణ, తనకాల నాగేశ్వరరావు,మళ్ళ అప్పల నర్సారావు, గ్రామస్థులు ఉన్నారు. బురద కాలువ సమస్య శాశ్వత పరిష్కారా నికి చర్యలు తీసుకోవాలని కోరారు.



శ్రీరంగపట్నంలో రోడ్డుపై పారుతున్న బురద కాలువ నీరు

నీటిలో దిగి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

నెమ్మదిగా పెరుగుతున్న గోదావరి

రాజమహేంద్రవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి)/ ధవళేశ్వరం : గోదావరి మళ్లీ స్వల్పంగా పెరుగుతుంది. ప్రమాద హెచ్చరికల స్థాయికి రాకపోవచ్చని అధి కారులు చెబుతున్నారు. భద్రాచలం వద్ద 33 అడుగల వరకూ తగ్గిపోయిన వరద ఆదివారం రాత్రి 8 గంటలకు 37.50 అడుగులకు చేరింది.ఇది నెమ్మదిగానే పెరిగింది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 8.30 అడుగులకు తగ్గిన వరద ఆదివారం రాత్రి 7 గంటలకు నీటిమట్టం 8.60 అడుగులుగా నమోదైంది. ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో ధవళేశ్వరం వద్ద నీటిమట్టం స్వల్పంగా పెరుగుతుంది. 5,83,757 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుంది.ఇది ఇంకొంచెం పెరిగే అవకాశం ఉంది. దీంతో గోదావరి పరీవాహక రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గత రెండు వారాలుగా గోదావరి భయపెట్టింది.అయితే ఎగువన వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గత రెండు రోజులు గోదావరి శాంతించింది.మళ్లీ నెమ్మదిగా పెరుగుతుండడంతో ఆందోళన చెందుతున్నారు.



ధవళేశ్వరం వద్ద నిలకడగా గోదావరి ప్రవాహం



పోలీస్..కూలీ!

అధికారులకు, హోంగార్డులకు ఒకటే రంగు ఖాకీ యూనిఫాం. ఇద్దరినీ పోలీస్ అనే పిలుస్తారు.. అయితే చేసే పని మాత్రం వేరు.. తమ తోటి ఉద్యోగి అనే ఆలోచనే ఉండదనుకుంటా.. అసలు వారి గురించి పట్టిం చుకునే వారే ఉండరు.. మీ సమస్యలన్నీ పరిష్కరిస్తాం అంటూ తమ శాఖలో సిబ్బందికి హామీలిచ్చే ఉన్నతాధికారులు..వాళ్ల చుట్టూ తిరిగే వాళ్లను మాత్రం హీనంగా చూస్తున్నారు.. హోంగార్డు ఉద్యోగం కూలీ కంటే హీనంగా తయారైంది.. ఉపాధి హామీ కూలీకైనా ఇన్ని గంటలు పని అని ఒక లెక్క ఉంటుంది. వీళ్లకు అదేం లేదు.. సార్ చెబితే చేయాల్సిందే.. లేదంటే అంతే. సెలవులు ఉంటాయా అంటే అదీలేదు.. జీతమూ అంతంతమాత్రమే.. పోనీ ఉద్యోగ భద్రత ఉంటుందా అంటే అదీ బాస్ కెరుక.. వాళ్లకు కోపం వచ్చిందంటే ఉద్యోగం ఊడుద్ది.. ప్రభుత్వం జీతం ఇస్తున్నా.. పనిమాత్రం పోలీస్ బాస్‌ల ఇళ్లవద్దే.. యూనిఫాం సర్వీసులో అత్యంత అల్పజీవులుగా, చులకన బతుకులుగా ఏళ్ల తరబడి ఒకే క్యాడర్‌లో నలిగిపోతున్న హోంగార్డుల వెతలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

హోంగార్డుల జీవితం దుర్భరం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

బ్రిటిష్ వాళ్లను మనం దేశం నుంచి తరిమికొట్టినా కొన్ని రంగాల్లో మాత్రం నేటికీ బానిసత్వం కొనసాగుతోంది. అలాంటి వ్యవస్థల్లో హోంగార్డులు ముందు వరుసలో ఉంటారు. పేరుకే పోలీస్ ఉద్యోగం.. చేసేది మాత్రం కూలి పనికంటే దారుణం.. హోంగార్డులకు ఉద్యోగ భద్రతే కాదు హెల్త్ ఇన్సూరెన్స్ వంటివి లేవు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో పోలీసులు, సిపాయిలకు, ప్రజలకు సహాయకులుగా హోంగార్డు వ్యవస్థ పురుడు పోసుకుంది. అప్పట్లో వీరిని 'సేవకులు(వాలంటీర్)'గా అభివర్ణించడంతో ఎన్నో ఏళ్లు గడిచినా అదే పేరుతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారు. ఇటు ప్రభుత్వోగులా.. అటు ప్రైవేటు ఉద్యోగులా అన్న విషయం ఇతమిద్ధంగా చెప్పలేని దుస్థితి. ప్రభుత్వ ఉద్యోగులు మాదిరిగా సీఎఫ్ఎంఎస్ కోడ్ ఉండడంతో సంక్షేమ పథకాలు వర్తించడం లేదు. పీఎఫ్, టీఏ, డీఏ వంటివి ఇవ్వడం లేదు. బందోబస్తుకు వెళ్లినా సొంత సొమ్ము ఖర్చు చేసుకోవాల్సిందే.తర్వాత అధికారుల దయను బట్టి ఆ డబ్బులు వస్తే అదృష్టమే. ఎవరైనా మరణించినా అంత్యక్రియల తర్వాత ఎప్పుడో రూ.25 వేలు వస్తాయంతే. ఈలోపు సహచర ఉద్యోగులు కాస్త మానవత దృక్పథం కలిగిన అధికారులు ఎంతో కొంత పోగేసి బాధిత కుటుంబం చేతిలో పెడతారు. రిటైర్మెంట్ అయిన రోజున మరీ అవమానకరంగా ఉద్యోగ జీవితం ముగుస్తుంది. ఏళ్ల తరబడి హోంగార్డుగా పనిచేసినా చివరి రోజున వచ్చే జీతాన్నే చేతిలో పెట్టి సాగనంపుతారు. రిటైర్ అయినా ఉద్యోగికి సహచర హోంగార్డులు ఒకరోజు జీతం విరాళంగా అందించి తమలో తామే గౌరవించుకుంటారు.

ఇళ్లలో పాచి పనులూ చేయాలా?

మహిళా హోంగార్డుల దుస్థితి చూస్తే కళ్లు చెమరుస్తాయి. పోలీస్ అధికారుల ఇళ్లల్లో పాచి పనులు చేసే పనో ళ్లగా మహిళా హోంగార్డులను వినియోగిస్తున్నారు. 'ఫలానా సార్ ఇంట్లో బట్టలు ఉతకాలట. మహిళా హోంగార్డును పంపండి' ఫోన్ వచ్చిన వెంటనే అందుబాటులో ఉన్న వారు ఆ అధికారి ఇంటికి పరుగు పెట్టాల్సిందే. ఒక వేళ ఇళ్లలో పనులకు వెళ్లలేకపోతున్నామంటూ గోడు వెళ్లబోసుకుంటే అప్పటి నుంచీ డ్యూటీల పేరుతో టార్చర్ తప్పదు.గతంలో ఎస్పీ, అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారుల ఇళ్లల్లో కూరగాయలు తీసుకురావడానికి, బయట పనులకు పురుష హోంగార్డులను.. ఇంట్లో పనులకు మహిళలను ఉపయోగించుకునేవారు. కానీ ఇప్పుడు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఇళ్లల్లో కూడా మహిళా హోంగార్డులు పాచి పనులు చేయాల్సిందే. ఉదయం 6 గంటలకు వెళ్లి గిన్నెలు తోమడం, తడిగుడ్డలు పెట్టడం, బట్టలు ఉతకడం, బాత్రూంలు కడగడం,పిల్లలకు స్నానాలు వగైరా చేయించడం, వాకిలి తుడవడం, వంట చేయడం, వారు షాపింగ్‌కి వెళ్తే వెంట వెళ్లడం వంటివి చేయాలి. అధికారులు ఫ్యామిలీతో ఊరెళ్లినా ఇల్లు కనిపెట్టుకొని ఉండాలి. వాళ్లు వస్తున్నామంటూ ఫోన్ చేస్తే ఇంటిని అద్దంలా మార్చేయాలి. అయినా వీళ్లను అమ్మగార్లు పని మనుషుల కంటే హీనంగా చూస్తున్నారనే ఆరోపణలున్నాయి. అమ్మగారు కరుణించి పంపిస్తే సాయంత్రం ఏ మూడు, నాలుగు గంటలకో ఇంటికి చేరతారు. అయినా సరే మళ్లీ స్టేషన్ డ్యూటీ మామూలుగానే చేయాల్సి ఉంటుంది. పైగా మహిళలని కూడా చూడకుండా ఇప్పుడు స్టేషన్లలో నైట్ డ్యూటీలు వేస్తున్నారు. ముఖ్యంగా అధికారుల ఇళ్లల్లో పాచి పనులు, నైట్ డ్యూటీలు చేయలేమంటూ హోంగార్డులు నెత్తీనోరూ బాదుకుంటున్నా బాసులు మాత్రం కనికరించడం లేదు.

నాడు టీడీపీ దయ చూపింది..

2019కి ముందు టీడీపీ ప్రభుత్వం హోంగార్డులపై దయ చూపింది. జీతాన్ని రెండు సార్లు పెంచింది. మహిళా హోంగార్డులకు 160 రోజుల ప్రసూతి సెలవులు కల్పించింది. నెలకు వేతనంతో కూడిన రెండు సెలవులు ఇవ్వాలని జీవో కూడా ఇచ్చింది. మహిళలకు నైట్ డ్యూటీలు, బందోబస్తులు ఉండేవి కావు. కానీ వైసీపీ పాలనలో హోంగార్డులు తమ సర్వీసులో ఎప్పుడూ పడని ఇబ్బందులను ఎదుర్కొన్నారు.బందోబస్తులకు సుదూరంగా పంపించే వాళ్లు. అక్కడ భోజనానికి 3 కిలోమీటర్లు నడిచి వెళ్లే పరిస్థితి ఉండేది. సీఎం కార్యాలయంలో కొన్ని రాష్ట్ర స్థాయి కార్యాలయాల్లో టర్నవుట్ పద్ధతిలో పని చేయా లంటూ విధులు కేటాయించేవారు. ఇచ్చే అరకొర జీతంతో అక్కడ ఇబ్బందులు పడేవాళ్లు. బందోబస్తుకు వెళితే కనీసం టీనీళ్లకు కూడా డబ్బులు వచ్చేవి కాదు. రోజుకు వచ్చే కూలి రూ.710లోనే అన్ని ఖర్చులూ భరించుకోవాలి.

జిల్లాలో 230 మంది

జిల్లాలో 230 మంది హోంగార్డులు ఉన్నారు. వీరందరూ అప్పట్లో టీడీపీ మాదిరిగానే ఇప్పుడు కూటమి ప్రభుత్వం తమకు అనుకూలమైన నిర్ణయం తీసుకుంటుందని ఎదురు చూస్తున్నారు. ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు సామర్థ్యాన్ని బట్టి కానిస్టేబుల్‌గా అవకాశం ఇస్తారని ఆశిస్తున్నారు. ఎక్స్‌గ్రేషియా, మెడికల్ బిల్లుల వంటి సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. కొత్త ప్రభుత్వంలోని మంత్రులు, ఎమ్మెల్యేలకు ఇప్పటికే వినతి పత్రాలు అందజేశారు. జిల్లాలోని సరిపడా హోంగార్డులు లేకపోవడంతో డబుల్, ట్రిపుల్ డ్యూటీలు తప్పడం లేదు. బందోబస్తు పూర్తయిందనే లోపుగా మరో చోట విధులు కేటాయిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఒంటిపై వస్త్రాలు ఉతుక్కోడానికి కూడా సమయం లేకుండా వీరితో చాకిరీ చేయించుకున్నారు. ఎన్నికల సమయంలో దాదాపుగా ఎవరూ కూడా ఇళ్లకు వెళ్లిన దాఖలాలు లేవు.

బతుకంతా హోంగార్డే

ప్రభుత్వ ఉద్యోగంలో ఎంత చిన్న స్థాయిలో జాయిన్ అయినా రిటైర్‌మెంట్ నాటికి ఎంతో కొంత ఎదుగుదల ఉంటుంది. కానీ హోంగార్డులు మాత్రం అదే హోదాలో ఉద్యోగంలో చేరి 40 ఏళ్ల పైబడి సర్వీసు చేసినా ఎదుగూ బొదుగూ లేకుండా అదే హోదాలో ఉద్యోగ విరమణ పొందుతారు. ఉద్యోగి బతుకంతా ఒకే కేడర్‌లో ముగ్గిపోవాల్సిందే. గతంలో కానిస్టేబుళ్ల రిక్రూట్‌మెంట్‌లో 20శాతం కోటా హోంగార్డులకు ఉండేది. దానిని తర్వాత 10 శాతానికి తగ్గించేశారు. వాస్తవానికి కానిస్టేబుల్‌తో సమానంగా వెపన్, లాఠీ వంటి శిక్షణ హోంగార్డుకు ఉంటుంది. 'లా' క్లాస్‌లు మాత్రమే ఉండవు. ఉద్యోగంలో జాయినైన తర్వాత కూడా కానిస్టేబుల్‌తో సమానంగా విధులు ఉంటాయి. హోంగార్డుల విషయంలో సుప్రీం కోర్టు నిర్దేశాలను చాలా రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారు. పొరుగున ఉన్న తెలంగాణలో నెలకు రూ.28 వేలు, ట్రా ఫిక్ డ్యూటీ చేసే వాళ్లకు రూ.35 వేల వరకూ వేతనం అందు తోంది. పుదుచ్చేరిలో నాలుగైదు ఏళ్లు హోంగార్డుగా పని చేస్తే కానిస్టేబుల్‌గా కన్వర్ట్ చేస్తున్నారు.

కేటగిరీలన్నీ హుష్‌కాకి..

అధికారుల ఇళ్ల వద్ద పాచి పనులు చేయడానికి గతంలో ఆర్డర్లీ వ్యవస్థ ఉండేది. బ్రిటిష్ వలస పాలకుల నుంచి వచ్చిన ఈ దాష్టీకాన్ని తర్వాత రద్దు చేశారు. కానీ అనధికారికంగా మాత్రం ఆర్డర్లీ వ్యవస్థకు ప్రతి రూపంగా హోంగార్డు వ్యవస్థ తయారైంది. హోంగార్డులను రిక్రూట్ చేసే సమయంలో ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజిస్తారు. కానిస్టేబుల్ చేసే నైట్‌బీట్లు, క్రైం, లా అండ్ ఆర్డర్, ఆఫీస్, కంప్యూటర్ ఆపరేటర్లు, డ్రైవర్లు వంటివి 'ఏ' క్యాటగిరీ, దోబీ, మోచీ వంటివి బీ, మరణించిన వారి ఫ్యామిలీకి వచ్చే ఉద్యోగాన్ని 'సీ' కేటగిరీగా చేశారు. అయితే తర్వాత మాత్రం వీరు విధులకు ఒక పద్ధతి అంటూ ఉండదు. పైవారు ఏమి చెబితే దానికి తలాడించాల్సిందే. సెలవులు ఉండవు. వారు పనిచేస్తున్న అధికారికి దయతలిస్తేనే సెలవు దొరుకుతుంది. అది కూడా ఆ రోజు వేతనం వదులుకోవాల్సిందే. నెలంతా ఉద్యోగం చేయాల్సిందే. ఆదివారం, వీకాఫ్, పండుగలు ఉండవు.

- ఉద్యోగ భద్రత లేదు..
- వేలల్లో జీతమూ లేదు..
- నిబంధనలూ పట్టవు..
- రోజుకు కేవలం రూ.710లే
- బాస్‌ల ఇళ్ల వద్దే పని
- అంట్లు తోమడం..ఇళ్లు కడగడం
- రాత్రికి పోలీస్ స్టేషన్‌లో కాపలా
- కాదంటే సారుతో చీవాట్లు
- సెలవు పెడితే జీతం కోత
- ప్రభుత్వ పథకాలకు దూరం
- గత టీడీపీ ప్రభుత్వంలో మేలు

9న రంపలో చంద్రబాబు పర్యటన?



రంపచోడవరం, ఆగస్టు4: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 9న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రంపచోడవరం రానున్నారని సమాచారం. ఆయన పర్యటనపై కొంత సందిగ్ధత నెలకొంది. ఇదిలా ఉండగా ఆదివారం ఆయన పర్యటించాల్సిన ప్రాంతాలను అధికారులు లోపాయికారీగా పరిశీలించారు. ఆదివాసీ దినోత్సవానికి ప్రతి సారీ ముఖ్యమంత్రులు అరకు ప్రాంతంలో పర్యటించడం రివాజుగా మారింది. ఈ మారు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివాసీ దినోత్సవానికి రంపచోడవరం రావడానికి సుముఖత వ్యక్తం చేశారు. ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాలకు సంబంధించి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ ఖరారు కావడం, ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో పర్యటనపై సందిగ్ధత నెలకొంది. అల్లూరి సీతారామరాజు జిల్లా కూడా ఎమ్మెల్సీ ఎన్నికల పరిధిలో ఉన్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సాధ్యాసాధ్యాలను ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు.ఈ పర్యటనపై ఇంకా స్పష్టత రావాల్సి ఉందని అధికార వర్గాలు అంటున్నారు.

నేడు అమరావతిలో కలెక్టర్ల మీటింగ్

రాజమహేంద్రవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : సీఎంగా చంద్రబాబు బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలిసారిగా రాజధానిలో కలెక్టర్ల మీటింగ్ ఏర్పాటు చేశారు. తొలుత సోమ, మంగళ వారాల్లో రెండు రోజుల పాటు నిర్వహించాలని భావించారు. కానీ సీఎంకు వేరే షెడ్యూల్ ఉండడం వల్ల సోమవారం ఒక్కరోజే నిర్వహిస్తారని చెబుతున్నారు. సమావేశానికి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి హాజరవుతు న్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7.55 గంటల వరకూ జరిగే సదస్సులోవ్యవసాయం, మార్కెటింగ్, సహకార రంగం తదితర శాఖ లపై సమీక్షించనున్నారు.ఈ మేరకు జిల్లాలోని ముఖ్యశాఖల సమాచారం అంతా సేకరించారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమం హౌసింగ్, రోడ్లు వంటి సమస్యల మీద కూడా సమీక్షించే అవకాశం ఉంది.

జిల్లాలో పలువురు ఎస్ఐలు బదిలీ

ఉత్తర్వులు జారీ చేసిన ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 4 : తూర్పుగోదావరి జిల్లాలో పలువురు ఎస్ఐలను బదిలీ చేశారు. ఏలూరు రేంజ్ ఐజీ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో ఎస్ఐల బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. సీతానగరం ఎస్ఐ టి.రామకృష్ణను తాళ్ళపూడి ఎస్ఐగా బదిలీ చేశారు. రాజానగరం ఎస్ఐ వీరమళ్ళ నాగవెంకట పవన్‌కుమార్‌ను గోకవరం ఎస్ఐగా, బిక్కవోలు ఎస్ఐ పి.బుజ్జిబాబును డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట టౌన్ ఎస్ఐగా బదిలీ చేశారు. దేవరపల్లి ఎస్ఐ కె.శ్రీహరిరావును కొవ్వూరు రూరల్ ఎస్ఐగా, నిడదవోలు ఎస్ఐ ఫులపా అప్పారావును పెరవలి ఎస్ఐగా, తాడేపల్లిగూడెం ట్రాఫిక్ స్టేషన్ ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యంను దేవరపల్లి ఎస్ఐగా, గోపాలపురం ఎస్ఐ కె.సతీష్‌కుమార్‌ను అక్కడే కొనసాగిస్తూ ఉత్తర్వులను ఎస్పీ నరసింహకిశోర్ జారీ చేశారు.



ఇసుక లెక్క తేల్చండి..

- సుప్రీం ఆదేశాలతో ఇసుక అక్రమాలపై విచారణ
- జిల్లా ఇసుక కమిటీ సభ్యులే విచారణాధికారులు
- రాఘవా కన్‌స్ట్రక్షన్, ప్రతిమా సంస్థపైనా కేసులు
- స్టాక్ పాయింట్లలో ఇసుక మాయంపై ఎఫ్ఐఆర్‌లు
- వైసీపీ ఇసుక దందా వెలికితీత.. 31న రిపోర్టు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)


గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో ఇసుక దోపిడీపై కూటమి ప్రభుత్వం విచారణ చేయిస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న ఇసుక కమిటీ సభ్యులతో విచారణ జరిపిస్తున్నారు. ఈ నెల 2వ తేదీన ఆదేశాలు జారీఅయ్యాయి. ఈ నెల 31వ తేదీలోపు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వవలసి ఉంది. గత వైసీపీ ఐదేళ్ల కాలంలో జిల్లాలో ఇసుక అక్రమాలు అనేకం జరిగిన సంగతి తెలిసిందే. మొదట జేపీ సంస్థకు కాంట్రాక్టు ఇచ్చి ఒకే బిల్లు మీద వందల లారీలు ఇసుక తరలించినా, సీనరేజీ ఎగ్గొట్టినా ఎవరూ పట్టించుకోలేదు. గతేడాది మేలోనే ఈ సంస్థ కాంట్రాక్టు పూర్తయిపోయినప్పటికి అదే కంపెనీ బిల్లులతో వైసీపీ పెద్దలు గోదావరిలో పడి ఇసుకు దోచేసిన సంగతి తెలిసిందే. అనంతరం టెండర్లు పిలవకుండా నెలకు ఇన్ని కోట్లు ఇవ్వాలని గుత్తబేరం కుదుర్చు కున్నారు. దీనిలో భాగంగా అనధికారికంగా డ్రెడ్జింగ్‌కు అనుమతివ్వడంతో ఆర్కే అనే వ్యక్తి రాత్రీ పగలూ ఇసుక దోపిడీ చేసిన సంగతి తెలిసిందే. ఇసుక కుంభకోణంలో కొవ్వూరుకు చెందిన ప్రేమరాజ్ అనే వ్యక్తి బలయ్యాడు. గత డిసెంబర్ వరకూ ఇష్టానుసారం దోచుకున్నారు. అయితే సుప్రీంకోర్టు ఆదేశాలతో తామంతా సక్రమంగానే చేస్తున్నామనే రికార్డులు సృష్టించడం కోసం మూడేళ్ల కిందట డ్రెడ్జింగ్‌కు ఒప్పందం కుదుర్చుకున్న రాఘవాకన్‌స్ట్రక్షన్ కంపెనీని ముందుకు తెచ్చారు. ఆ సంస్థ పేరిట అన్ని ర్యాంపులలో డ్రెడ్జింగ్ చేశారు. కానీ ప్రభుత్వం మారడంతో కాంట్రాక్టర్లంతా పరారయ్యారు.ఇక్కడ జరిగిన కోట్లాది రూపాయల ఇసుక అక్రమాలు బయటపడుతున్నాయి.అక్రమాల్లో ఇసుక వ్యాపారి బలన్మరణం చెందిన సంఘటన నుంచి ఆర్కే అనే వ్యక్తితో వైసీపీ చేయించిన దోపిడీ లన్నీ వెలికితీయనున్నారు. జిల్లాలో ఇప్పటికే రాఘవా కన్‌స్ట్రక్షన్ కంపెనీ, ప్రతిమా సంస్థలపై కేసులు పెట్టారు. ఉసులుమర్రు, పందలపర్రు స్టాక్ పాయింట్ల విషయంలో కూడా కేసులు పెట్టారు.కొవ్వూరులో ఎర్రమ్మ ర్యాంపు వద్ద అక్రమాలకు కారణం రాఘవా కన్‌స్ట్రక్షన్ కంపెనీయేనని కొవ్వూరు లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.అవినీతి వెలుగులోకి వస్తే వైసీపీ పెద్దలు, తప్పుడు రిపోర్టులు ఇచ్చిన అప్పటి కలెక్టర్, ఎస్పీలు ఇరుక్కునే అవకాశం ఉంది.

ఉద్యాన పంటల నిధులు విడుదల



రాజమహేంద్రవరం రూరల్/కడియం ఆగస్టు4: ఉద్యాన పంటలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు అందించే దిశగా 2023-24 సంవత్సరానికి సంబంధించి నిధులు విడుదల చేశామని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నేషనల్ మిషన్ ఫర్ ఆయిల్ పాం పథకంలో భాగంగా జిల్లాలో రైతులకు సబ్సిడీపై ఆయిల్ పాం మొక్కలు అందజేయడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా 3 వేల హెక్టార్లలో ఎరువుల నిమిత్తం రైతుల బ్యాంకు ఖాతాలకు సీఎఫ్ఎంఎస్ ద్వారా జమ చేస్తారన్నారు. ఇప్పటి వరకు రూ.419 లక్షలు జమ అయినట్టు తెలిపారు. మామిడి, జీడిమామిడి, టిష్యూ కల్చర్, అరటి, కోకో తదితర పంటలకు సాగు చేసే రైతులకు రూ.28.5 లక్షలు సబ్సిడీ నిధులు విడుదల చేశారన్నారు. ఇప్పటి వరకు రూ18.87 లక్షలు సీఎఫ్ఎంఎస్ ద్వారా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం ద్వారా జిల్లాలో నెలకొల్పిన ఉద్యాన పంటల సేకరణ నిర్మాణానికి ఒక్కో సెంటరుకు రూ. 5.25 లక్షల చొప్పున విడులయ్యాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 15 కలెక్షన్ సెంటర్లకు రూ.78.75 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు.

కోట సత్తెమ్మకు విశేష పూజలు



నిడదవోలు, ఆగస్టు 4 : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు.అనంతరం అమ్మవారికి క్షీర నివేదన మహానివేదన చేశారు. ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి మొత్తం రూ.1,85,733లు ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్, కార్య నిర్వహణాధికారి వి.హరి సూర్య ప్రకాష్‌ఆలయ చైర్మన్ దేవులపల్లి రవి శంకర్ తెలిపారు.

మహిళలకూ హాస్టల్

- వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల ఏర్పాటు
- సీఎం ఆదేశాలతో కదలిక
- ఇప్పటికే రాజమహేంద్రిలో ఒకటి
- అందులో 50 మందికి వసతి
- విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం
- మహిళా ఉద్యోగుల ఆనందం



రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 4 : పట్టణాలు, నగరాల్లో ఉద్యోగాలు చేసుకునే మహిళలకు వసతి గృహాలను ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు చేసిన ప్రకటనతో వర్కింగ్ ఉమెన్స్‌కు మరింత భద్రత ఏర్పడనుంది. ఎక్కడెక్కడి నుంచో పట్టణాలు, నగరాలకు వచ్చి చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకుని జీవించే ఎంతో మంది మహిళలకు సీఎం చేసిన ప్రకటన వరంగా మారనుంది. చాలీచాలని జీతాలతో వేల రూపాయలు చెల్లించి అద్దె భవనాల్లో ఉంటూ, అభద్రత నడుమ జీవించే పరిస్థితుల నుంచి బయటపడే మార్గం రాబోయే రోజుల్లో సుగమం కానుంది.

రాజమహేంద్రిలో ఎప్పటి నుంచో..

రాజమహేంద్రవరంలో ఎప్పటి నుంచో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నడుస్తోంది. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ పర్యవేక్షణలో ఉమెన్స్ కళాశాలకు ఎదురుగా కందుకూరి వీరేశలింగం సంస్థలకు చెందిన స్థలంలో నిర్వహిస్తున్నారు. హాస్టల్‌లో మొత్తం 16 గదులు ఉన్నాయి. ఒక్కో గదిలో ముగ్గురు చొప్పున ఇరుకిరుకుగా సర్దుకుంటున్నారు. వసతిగృహంలో చేరడానికి చాలా మంది వస్తున్నా గదుల కొరత కారణంగా కొత్తగా వచ్చేవారికి అవకాశం లేకుండా పోతోంది. ప్రస్తుతం ఈ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో 50 మంది ఉద్యోగినులు వసతి పొందుతున్నారు. వీరంతా ప్రైవేట్‌రంగంలో పనిచేస్తున్న ఉద్యోగినులే కావడం గమనార్హం. ప్రతి నెలా కొంత మొత్తాన్ని ఉదయం టిఫిన్, రెండు పూటలా భోజనం, ఇతర ఖర్చుల కు కేటాయించుకుని సొంత మెనూ ప్రకారం హాస్టల్ నిర్వహణ చేపడుతున్నారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారిణి పర్యవేక్షణలో ఒక సూపరింటెండెంట్ ఈ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ దైనందిన కార్యకలాపాలన్నింటినీ చూసుకుంటారు. అలాగే ఇక్కడ ఒక మేట్రిన్, వాచ్‌మెన్‌తో పాటు ఉద్యోగినులకు వంట చేయడానికి ఇద్దరు కుక్‌లను ప్రభుత్వమే నియమించింది.

నగరంలో డిమాండ్ ఎక్కువే..

రాజమహేంద్రవరంలో వేలాది మంది మహిళలు ఉద్యోగాలు చేస్తుంటారు. ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఉపాధి పొందుతారు. ఇటీవల అనేక చిన్న, పెద్ద పరిశ్రమలు రాజమహేంద్రవరం పరిసరాల్లో పెద్దసంఖ్యలో ఏర్పాటు కావడంతో వాటిలో పనిచేసే మహిళా ఉద్యోగినుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రైవేట్ ఆసుపత్రులు, మెడికల్ షాపులు, హోటళ్లు వంటి రంగాల్లోనూ విస్తృత సంఖ్యలో మహిళలు పనిచేస్తున్నారు. వీరందరికీ వసతి గృహాల కొరత తీవ్రంగా ఉంది. చాలా మంది ప్రైవేట్ హాస్టల్స్‌లో ఉంటూ ఉద్యోగాలు చేస్తున్నా అక్కడ సరైన భద్రత ప్రమాణాలు లేకపోయినా సర్దుకుపోతున్నారు. ఉద్యోగినులకు పెద్ద సంఖ్యలో వసతిగృహాలు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ప్రభుత్వం నుంచి రావడంతో జిల్లా అధికారుల్లోనూ కదలిక మొదలైంది.

కొత్త హాస్టల్‌కు ప్రతిపాదన..

ప్రస్తుత హాస్టల్ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో కొత్తగా మరో 16 గదులను నిర్మించాలనే ప్రతిపాదనలను జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారులు సిద్ధం చేసినట్టు సమాచారం. ప్రస్తుత భవనం యథాతథంగా ఉంచి కొత్త గదులు నిర్మిస్తే మరింత మందికి వసతి కల్పించవచ్చని భావిస్తున్నారు. ఉద్యోగినుల హాస్టల్స్‌కు ఉన్న డిమాండ్ మేరకు ప్రధాన రైల్వేస్టేషన్ లేదా కోటిపల్లి బస్టాండు ఏరియాలో కొత్తగా వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మిస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నాయకులు ప్రతిపాదిస్తున్నారు. అర్బన్ తహశీల్దార్ కార్యాలయం పక్కనే వసతిగృహానికి అనువైన ప్రభుత్వ స్థలం ఉందని సూచిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలమేరకు జిల్లా ఉన్నతాధికారులు ఎలాంటి ప్రతిపాదనలు సిద్ధం చేస్తారనేది వర్కింగ్ ఉమెన్స్‌లో చర్చనీయాంశంగా మారింది.



కాలం నీ నేస్తం ముస్తఫా...

మోతుగూడెం మన్యంలో కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జలపాతాలు పాలనురగలా జాలువారుతూ ఆకట్టుకుంటున్నాయి. పొల్లూరు జలపాతం అందాలు మురిపిస్తున్నాయి. ఈ ప్రాంతానికి కింద పచ్చని చెట్లు ప్రకృతి ప్రేమికులకు ఆకట్టుకుంటున్నాయి. భారీ వర్షాలకు కొండవాగు ప్రాంతాలు జలపాతాలను తలపిస్తూ ప్రవహిస్తున్నాయి. ఆదివారం ఫ్రెండ్‌షిప్‌డే కావడంతో పర్యాటకులు పొల్లూరు జలపాతం వద్ద సందడి చేశారు. ముస్తఫా... ముస్తఫా డోంట్ వర్రీ ముస్తఫా... కాలం నీ నేస్తం ముస్తఫా అంటూ పాట పాడుకుంటూ ఆనందంగా గడిపారు.

- మోతుగూడెం



ఉదయిస్తు భానుడూ...

శ్రీసూర్యనారాయణ మేలుకో... హరి సూర్యనారాయణ అన్నట్టుగా ఉంది కదూ... తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం తీపర్రు వద్ద గోదావరిలో ఆదివారం కనిపించిన సూర్యోదయం చిత్రమిది. - పెరవలి

నేటి నుంచి సత్యదేవుని ఆవిర్భావ వేడుకలు

అనంతలక్ష్మి అమ్మవారికి వజ్రకిరీటం సమర్పించనున్న దాత మట్టే సత్యప్రసాద్

అన్నవరం, ఆగస్టు 4: రత్నగిరివాసుడైన సత్యదేవుని క్రోధి నామ సంవత్సర ఆవిర్భావ వేడుకలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఉదయం 8 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన జరుపుతారు. మంగళవారం స్వామివారి ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ సుగంధభరిత పుష్పాలతో అలంకరించనున్నారు. అనివేటి మండపంలో ఆయుష్య హోమం చేస్తామని అధికారులు వెల్లడించారు.

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మి అమ్మవారికి లలిత రైస్ ఇండస్ట్రీస్ అధినేతల్లో ఒకరైన మట్టే సత్యప్రసాద్ తయారు చేయించిన వజ్రకిరీటం, స్వామి, అమ్మవార్ల వజ్రకర్ణాభరణాలను దేవస్థానం అధికారులకు సోమవారం మధ్యాహ్నం అందజేయనున్నారు. ఈ మేరకు దాత ఆదివారం దేవస్థానం అధికారులు, పండితులతో చర్చించారు. మంగళవారం ఉదయం మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకాల అనంతరం వజ్రకిరీటంతో భక్తులకు దర్శనమివ్వనున్నారు. కార్యక్రమంలో లలిత రైస్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మట్టే ఆదిశంకర్ పాల్గొన్నారు.

సత్యదేవుని సన్నిధిలో మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు



రత్నగిరివాసుడైన సత్యదేవుని ఆదివారం రాష్ట్ర టూరిజం, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్, దెందులూరు ఎమ్మెల్యే ధర్మరాజు, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప దర్శించారు. దేవస్థానంలో జరిగిన ఒక ఫంక్షన్‌కు వీరంతా హాజరయ్యారు. వారికి పీఆర్వో కృష్ణారావు, ఏపీఆర్వో గణపతిరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

ఆనాటి ఆ స్నేహ ఆనంద గీతం...



వీరంతా శ్రీకాకుళంలోని గురజాడ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో 1993-94 బ్యాచ్ బీఈడీ విద్యార్థులు. ఇందులో రవికుమార్, దేవానంద్, చంద్రరావు, రాంబాబు, రాజారావు తూర్పు గోదావరి జిల్లాలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. వారి సహాధ్యాయి డి.నరసింహ కిశోర్ ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ. ఆదివారం వారంతా రాజమహేంద్రవరంలో కలుసుకున్నారు. ఎస్పీకి స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు చెప్పారు. ఆలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కొద్దిసేపు ఆనందంగా గడిపారు.

... రాజమహేంద్రవరం సిటీ

చంద్రబాబు పాలనతో పరిశ్రమలకు భరోసా

- 'అల్ట్రాటెక్' ప్రమాద మృతులకు భారీ పరిహారం చెల్లించాం
- ఈఎస్ఐ పరిధిలోకి అసంఘటిత కార్మికులు, జర్నలిస్టులు
- తప్పుడు పనులు చేసేవారిని సమర్థించేది లేదు
- మీట్ ది ప్రెస్‌లో మంత్రి కార్మిక శాఖ మంత్రి సుభాష్



రామచంద్రపురం (ద్రాక్షారామ), ఆగస్టు 4: ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనతో రాష్ట్రంలో పరిశ్రమలకు భరోసా వచ్చిందని రాష్ట్ర కార్మిక, పరిశ్రమల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని బుచ్చిరాజు కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన 'మీట్ ది ప్రెస్'లో ఆయన మాట్లాడారు. ఇటీవల అల్ట్రాటెక్ సిమెంటు పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన నలుగురి కుటుంబాలకు రూ.50 లక్షలు చొప్పున పరిహారం చెల్లించామన్నారు. గత వైసీపీ పాలనలో పరిశ్రమల్లో భద్రతా చర్యలు తీసుకోవడంలో థర్డ్ పార్టీని ప్రవేశపెట్టి పరిశ్రమలను దోచుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పారిశ్రామికవేత్తలకు భరోసా లభించిందన్నారు. రాష్ట్రంలో అసంఘటిత రంగ కార్మికులను, జర్నలిస్టులను ఈఎస్ఐ పరిధిలోకి తీసుకువచ్చే ఆలోచన చేస్తున్నామన్నారు. ఈఎస్ఐ సౌకర్యంతో మెరుగైన వైద్య సేవలు పొందే అవకాశం ఉంటుందన్నారు. ఆరోగ్యశ్రీ పథకంపై భారం తగ్గుతుందన్నారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం ఈఎస్ఐ కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను సద్వినియోగపరచలేదన్నారు. 34 మంది వైసీపీ కార్యకర్తలను చంపినట్టు సాక్షి చానల్‌లో తప్పుడు ఆరోపణలు చేశారని, వారి పేర్లు చెప్పమంటే మాజీ సీఎం జగన్‌కు మాటలు రావడం లేదన్నారు. ప్రభుత్వంపై తన పత్రిక, చానల్ ద్వారా జగన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఇటీవల పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలో బెదిరింపు కేసులో ఇద్దరు టీడీపీ నాయకులపై కేసు నమోదు చేశారని, వారిని అరెస్టు చేసేందుకు గాలిస్తున్నారన్నారు. తాను వారిని సమర్థిస్తున్నట్టు తప్పుడు వార్తలు ప్రచారం చేశారని, తాను మద్దతు ఇస్తే వారిపై పోలీసు కేసు నమోదు ఎందుకు అవుతుందన్నారు. తప్పుడు పనులుచేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించనని స్పష్టం చేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 30 వేల మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, నియోజకవర్గంలో ప్రెస్‌క్లబ్ భవనం నిర్మాణానికి సహకరిస్తానన్నారు. నియోజకవర్గ పరిధిలో దివ్యాంగులకు ఉద్యోగాలు, వైద్య పరీక్షలు, కృత్రిమ అవయవాలు సమకూర్చేందుకు మెగా శిబిరం ఏర్పాటు చేయిస్తానన్నారు. ల్యాబ్‌లు, మెడికల్ షాపులు నియంత్రణ పాటించాలని, లేనిపక్షంలో తానే కనీస చార్జీలతో ల్యాబ్, మెడికల్ షాపు పెడతానని హెచ్చరించారు. డీఎస్సీ పరీక్ష రాసేవారికి ఉచితంగా కోచింగ్ ఇచ్చేందుకు ఉద్దేశించిన పోస్టర్‌ను మంత్రి సుభాష్ ఆవిష్కరించారు. తన పూర్తి సహకారంతో ఎక్కువ మంది ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందేందుకు వీఎస్ఎం కళాశాలలో ఉచిత కోచింగ్ ఇస్తామని చెప్పారు.

హౌసింగ్ మాయాజాలం!

- టీడీపీ హయాంలో ఇల్లు మంజూరు
- వైసీపీ హయాంలో నిర్మాణం
- బిల్లు మంజూరు కాక అప్పులు చేసి పూర్తి
- రూ.77వేలు చెల్లించినట్టు రికార్డుల్లో...
- ఖాతాలో ఒక్క రూపాయి కూడా జమ కాని వైనం
- ఆవేదన చెందుతున్న వృద్ధ దంపతులు



కొప్పవరంలో వృద్ధ దంపతులు నిర్మించుకున్న ఇల్లు


అనపర్తి, ఆగస్టు 4: తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలంలో హౌసింగ్ మాయాజాలం వెలుగు చూసింది. గృహ నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులకు సుమారు రూ.77వేలు చెల్లించినట్టు అధికారులు రికార్డుల్లో చూపిస్తున్నారు. అయితే తమ ఖాతాలోకి ఒక్క రూపాయి కూడా జమకాలేదంటున్నారు లబ్ధిదారులు. వివరాలు ఇలా వున్నాయి... తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం కొప్పవరం గ్రామానికి చెందిన సత్తి తాతారెడ్డి-మంగయ్యమ్మ దంపతుల పాత ఇల్లు శిథిలావస్థకు చేరుకోడంతో 2018లో అప్పటి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని ఆశ్రయించగా హౌసింగ్ లోన్ మంజూరు చేయించారు. దాంతో వారు తమ వద్ద ఉన్న కొద్దిపాటి సొమ్ముతో గృహ నిర్మాణం ప్రారంభించారు. 2019లో ప్రభుత్వం మారడంతో ఒక్క బిల్లూ మంజూరు కాలేదు. దీంతో అప్పులు చేసి ఇంటి నిర్మాణం పూర్తి చేశారు. అయినా నేటికీ ఒక్క రూపాయి కూడా అందకపోవడంతో మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు కర్రి వెంకటరామారెడ్డిని ఆశ్రయించడంతో ఆయన వారిని వెంట పెట్టుకుని హౌసింగ్ కార్యాలయానికి చేరుకుని ఆరా తీశారు. వీరికి 2020 జూన్ 23న రూ.1, 2020 జూలై 24న రూ19,299, 2023 జూన్ 20న రూ.19,500 2023 జూలై 6న రూ.38,800 జమ చేసినట్టు రిపోర్టు ఇచ్చారు. దీంతో మాజీ సర్పంచ్ వారిని వెంట బెట్టుకుని మహేంద్రవాడలోని స్టేట్ బ్యాంకుకు వెళ్లగా వారి ఖాతాలో హౌసింగ్ నుంచి ఒక్క రూపాయి కూడా జమకాలేదని స్టేట్‌మెంట్ ఇవ్వడంతో ఖంగుతిన్నారు. తిరిగి హౌసింగ్ కార్యాలయానికి చేరుకుని ఏఈ వనమయ్య, డీఈ వేణుగోపాల్‌లకు పరిస్థితిని వివరించగా మంగయ్యమ్మకు చెందిన రెండో ఖాతాలో సొమ్ము జమ అయినట్టు రిపోర్టు ఇచ్చారు. తిరిగి అదే బ్యాంకుకు వెళ్లినా ఆ ఖాతాలో కూడా ఒక్క రూపాయీ పడలేదని తేలింది. ఇంటి నిర్మాణం కోసం అప్పులు చేశామని, కుమారుడిని కూడా పోగొట్టుకున్నామంటూ వృద్ధ దంపతులు కన్నీరుపెట్టుకున్నారు. దీంతో మాజీ సర్పంచ్ వెంకటరామారెడ్డి అధికారులను నిలదీయగా... సాంకేతికలోపంతో ఇలా జరిగి ఉండవచ్చని, ఇప్పటివరకు విషయం తమ దృష్టికి రాలేదని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని డీఈ వేణుగోపాల్ తెలిపారు. లోపాన్ని సరిచేసి రెండు, మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకటరామారెడ్డి మాట్లాడుతూ బాధితులకు రుణం మొత్తం రూ.1.50 లక్షలు ఒకేసారి అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. గతంలో టీడీపీ హయాంలో మంజూరైన అనేక మందికి బిల్లులు రాలేదని, అధికారుల చుట్టూ తిరగలేక వారంతా ఊరుకున్నారని, విచారణ జరిపిస్తే ఇలాంటి అనేక సంఘటనలు బయటపడతాయన్నారు.



తాతారెడ్డి, మంగయ్యమ్మ దంపతులు

వైద్య రంగంలో 'మైక్రో బయాలజీ'దే కీలక భూమిక

- అంతర్జాతీయ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ 'పద్మభూషణ్' డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి
- జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో ముగిసిన ఐఎంఏ సదస్సు



రాజానగరం, ఆగస్టు 4: రానున్న ఐదేళ్లలో వ్యాధి నిర్ధారణ, చికిత్సలకు మైక్రోబయాలజీ మూలాధారం అవుతుందని అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ 'పద్మభూషణ్' డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డి అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో రెండు రోజులు జరిగిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సౌత్ జోన్ వైద్య విజ్ఞాన సదస్సు ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. బ్యాక్టీరియా గురించి చర్చించే మైక్రోబయాలజీ రంగంలో ప్రపంచవ్యాప్తంగా 100 సెంటర్లలో అధ్యయనాలు, పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. దేశంలోని ఆరు కేంద్రాల్లో పరిశోధనలు జరుగుతుండగా..... ప్రైవేట్ రంగంలో ఏకైక సంస్థ ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ-ఏఐజీ ఛైర్మన్‌గా తాను వ్యవహరిస్తున్నట్టు చెప్పారు. సహజ స్వాభావిక ఆహారం, అవసరమైన బ్యాక్టీరియాను ఇవ్వడమే వ్యాధులకు భవిష్యత్తులో చికిత్స అవుతుందని వివరించారు. పేగుల్లో నివసించే వెయ్యి రకాల బ్యాక్టీరియాలో హెచ్చు తగ్గులు రకరకాల వ్యాధులకు కారణమవుతున్నాయని చెప్పారు. ప్రధానంగా ఆహారంలో మార్పుల వల్లే బ్యాక్టీరియాలో సమతూకం దెబ్బతిని రకరాల జబ్బులు, వ్యాధులు సంక్రమిస్తున్నాయని నాగేశ్వర్‌రెడ్డి వివరించారు. సిజేరియన్ కాకుండా సహజ ప్రసవం ద్వారా పుట్టిన బిడ్డలు, కనీసం ఆరు నెలలు తల్లి పాలు తాగిన బిడ్డలు, ఆరు నెలలలోపు యాంటీబయాటిక్స్ వాడని పిల్లల్లో మంచి బ్యాక్టీరియా వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తడం లేదని ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇంటి భోజనం చేసే వారికి, బయట జంక్ ఫుడ్ తీసుకునే వారికి బ్యాక్టీరియాల్లో తేడాలను ప్రయోగాల్లో తమ సంస్థ గమనించిందన్నారు. మన వాతావరణానికి సరిపడే ఇడ్లీ, దోసె, పెరుగు మొదలైనవి తిన్నవారిలో కేన్సర్ నెమ్మదించినట్టు అధ్యయనాల్లో తేలిందన్నారు. ఇక్కడకు వచ్చిన ప్రతిసారీ జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు కొత్త అనుభవాలను ఇనుమడింపచేస్తున్నారని డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి ప్రశంసించారు. డాక్టర్ వాడ్రేవు రవి (కాకినాడ), డాక్టర్ పీఎస్ఎస్ఎన్ మూర్తి (అమలాపురం) చైర్‌పర్సన్లుగా వ్యవహ రించగా డాక్టర్ వాణీమాధవి (జీఎస్ఎల్), డాక్టర్ పీఎస్ఎస్ శర్మ (అమలాపురం), డాక్టర్ సోమనాథ్‌దాస్ (జీఎస్ఎల్) ముగింపు సదస్సు నిర్వహించారు. చివరగా డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల యాజమాన్యం దుశ్శాలువాతో సత్కరించింది.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

WANTED FRANCHISE

HAP DAILY Products Arun ICE CREAM Arokya, Hatsun company Provides shop advance, Shop Rent, Electric Bill, **Cont: 9177387658, 7337360350**

AJD :177382

WANTED

జీతము: 12,000/- నుండి 20,000/- సూపర్‌వైజర్లు కావలెను. అర్హత 10th to డిగ్రీ టెక్నికల్ నాలెడ్జ్ ఉన్న వారికి ప్రాధాన్యత Cont శ్రీదేవి హోండా, అథరైజ్డ్ డీలర్ హోండా టూ వీలర్స్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, మెయిన్ రోడ్, కాకినాడ సెల్ : 9490998888

AJD :36

WANTED

★ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 20k.

Phone : 8977639662 / 8977639663 AJH-4211

4 Lines CLASSIFIED Rs.230/- Only

కాపర్ వైరు దొంగలు దొరికారు

- తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాలకు చెందిన పదకొండు మంది అరెస్టు
- మినీ వ్యాన్, ఆటో, రూ.2.40 లక్షలు విలువైన 420 కిలోల కాపర్ వైరు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న కొవ్వూరు రూరల్ సీఐ శ్రీనివాసరావు

కొవ్వూరు, ఆగస్టు 4: పంట పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పగలుగొట్టి కాపర్ వైరు దొంగతనం చేస్తున్న 11 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఒక మినీ వ్యాన్, ఆటో, రూ2.40 లక్షలు విలువైన 420 కిలోల కాపర్ వైరు, దొంగతనాలకు వినియోగించిన పనిముట్లను స్వాధీనం చేసుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను కొవ్వూరు రూరల్ సీఐ వి.శ్రీనివాసరావు వెల్లడించారు. కొవ్వూరు రూరల్ పోలీస్టేషన్‌లో 4, కొవ్వూరు టౌన్‌లో 2, తాళ్లపూడిలో 1, నల్లజర్లలో 3, చాగల్లులో 1, దేవరపల్లిలో 2, గోపాలపురంలో 1, రాజానగరంలో 2, కాకినాడ జిల్లా అన్నవరంలో 2 కేసులకు సంబంధించి 22 ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి దొంతనాలకు పాల్పడిన ఏడుగురిని, కాపర్ వైర్ కొనుగోలు చేసిన నలుగురు వ్యాపారస్తులను అరెస్టు చేశారు. కొవ్వూరు మండలం వేములూరుకు చెందిన సారిక సురేష్ తాపీ పనిచేస్తూ అప్పుడప్పుడు హైదరాబాద్ వెళ్లి వస్తుండేవాడు. హైదరాబాద్‌లో కాకినాడ జిల్లాకు చెందిన పల్లా లోవరాజు, వేములూరుకు చెందిన తంపర సురేష్, సారిక దుర్గారావు, మట్టా శివ, మల్లిచెట్టు దోలానంద్, మంగిన అజిత్‌కుమార్, రేఖ సుధాకర్ ఒకేచోట తాపీ పని పనిచేస్తుండేవారు. సారిక సురేష్ ఎలక్ట్రీషియన్ పని నేర్చుకున్నాడు. ఖాళీ ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కడ ఉన్నాయో గుర్తించి వాటిలో రాగి వైరు అమ్ముకుంటే ఎక్కువ డబ్బులు సంపాదించుకోవచ్చని ఎనిమిది మంది నిర్ణయించుకున్నారు. పలు పోలీసుస్టేషన్ల పరిధిలో రాత్రి సమయాల్లో పంట పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల పగలగొట్టి వాటిలోని కాపర్ వైరు వేరు చేసి పల్లా లోవరాజు వ్యానులో తీసుకొచ్చేవారు. అనంతరం వాటిని కొవ్వూరు మండలం సీతంపేటలో జై హనుమంతు టింకరింగ్ షాప్‌లో నరమామిడి సత్యనారాయణ, కాకినాడ జిల్లా కిర్లంపూడిలో శ్రీ వెంకట దుర్గా ఆంజనేయ ట్రేడర్స్‌లో సరిక కృష్ణ, పెరవలి మండలం కాపవరంలో చింతలపూడి సత్యనారాయణ, రాజమహేంద్రవరం లాలాచెరువు హౌసింగ్ బోర్డులో టీఆర్ఎస్ ఎంటర్‌ప్రైజస్‌లో పన్నెరు నంది కేశవరావులకు చెందిన పాత ఇనుప సామగ్రి కొనే షాపుల్లో విక్రయించేవారు. ఇటీవల కొవ్వూరు మండలం చిడిపిలో పంట పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనానికి వెళ్తుండగా కొవ్వూరు రూరల్ పోలీసులు, క్రైం పోలీసులు దాడి చేసి ఏడుగురిని, ఆపై వైరు కొనుగోలు చేసిన నలుగురిని పట్టుకుని అరెస్టు చేశారు. దర్యాప్తులో విశేష కృషి చేసిన కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్, క్రైం ఎస్ఐ కె.జగన్మోహనరావు, ఏఎస్ఐ జె.ధర్మరాజు, టి.శ్రీనివాసరావు, జి.అనీల్‌కుమార్, అఫ్సారీబేగ్, ఎస్.గణేష్, ఎస్కే వల్లీబాబు, హెచ్‌సీ జీఎస్ఆర్‌కే పరమహంసలను సీఐ అభినందించారు.



రైలులో గర్భిణి ప్రసవం

- అప్రమత్తమైన జీఆర్పీ పోలీసులు
- ఆసుపత్రికి తరలింపు... తల్లీబిడ్డ క్షేమం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 4: బొకారో ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేస్తున్న ఒక నిండు గర్భిణి పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం... బిహార్‌కు చెందిన అమరజీత్ రామ్. అతని భార్య హీరాకుమారి జీవనోపాధి నిమిత్తం కోయంబత్తూరులో ఉంటున్నారు. నెలలు నిండిన హీరాను బిహార్ తీసుకెళ్లడానికి ఈ నెల 3న బొకారో ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరాడు. రైలు రాజమహేంద్రవరం గోదావరి బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి హీరాకు పురిటినొప్పులు రాగా వెంటనే మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ సమాచారం తెలిసిన సీఐ విజయశంకర్ స్పందించి రైలు రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌కు వచ్చేసరికి రైల్వే వైద్యులను, జీఆర్పీ సిబ్బందిని అప్రమత్తం చేశారు. స్టేషన్‌కు రైలు రాగానే తల్లీబిడ్డను కిందకు దింపించి స్టేషన్లో హెల్త్ చెకప్ చేయించి ఆపై 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్టు వైద్యులు చెప్పారని విజయశంకర్ వివరించారు.



హీరాకు వైద్యం అందిస్తున్న వైద్యులు

గంజాయి గుట్టురట్టు

దివాన్‌చెరువు జీరో పాయింట్ వద్ద తనిఖీ... వ్యాను ప్రత్యేక అరలో 444 కిలోల పట్టివేత

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 4: తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం జాతీయ రహదారిపై దివాన్ చెరువు జీరో పాయింట్ వద్ద గంజాయి తరలిస్తున్న వ్యాన్‌ను పట్టుకుని 443.860 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు సౌత్‌జోన్ డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ ఆదివారం తెలిపారు. ఎస్పీ కార్యాలయానికి వచ్చిన సమాచారంతో శనివారం సాయంత్రం దివాన్‌చెరువు వద్ద వ్యాన్‌ను తనిఖీ చేయగా అందులో 14 ప్లాస్టిక్ సంచుల్లో గంజాయి ఉందన్నారు. వ్యాన్‌ను సీజ్ చేసి తమిళనాడు 8వ క్రాస్‌స్ట్రీట్ హౌసింగ్ బోర్డు, కురుంబాపేటకు చెందిన డ్రైవర్ దివాకర్‌ను అరెస్టు చేశామన్నారు. అతన్ని విచారించగా.. ఈనెల 3న దివాన్‌చెరువు వద్దకు వచ్చిన డ్రైవర్ దివాకర్, వ్యాన్ యజమాని కలిసి గండేపల్లి మండలం మురారి గ్రామం వెళ్లారని, అక్కడ మరో వ్యక్తితో కలిసి వ్యానులో జగ్గంపేట వెళ్లి జాతీయ రహదారిలో ఏజెన్సీ రోడ్డులోకి సుమారు 9 కిలోమీటర్లు వెళ్లాక దివాకర్‌ను అక్కడే ఉంచి మిగిలిన ఇద్దరూ అడవిలోకి వెళ్లారు. కొన్ని గంటల తర్వాత ఇద్దరూ వ్యాన్‌లో తిరిగొచ్చారు. జగ్గంపేట వచ్చాక ఆ ఇద్దరు దిగిపోయి వ్యాన్‌ను జాగ్రత్తగా తమిళనాడులో దిండివనం ప్రాంతానికి చేర్చమని దివాకర్‌కు చెప్పారు. జాతీయ రహదారిపై వ్యాను వస్తుండగా దివాన్‌చెరువు వద్ద పట్టుకున్నామని, తనిఖీ చేయగా వ్యాన్ క్యాబిన్ వెనుక ఏర్పాటు చేసిన ప్రత్యేక అరలో గంజాయిని గుర్తించామని తెలిపారు. డ్రైవర్ దివాకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు. తనిఖీల్లో బొమ్మూరు సీఐ ఎండీ ఉమర్, సబ్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహకిషోర్ ఒక ప్రకటన విడుదల చేశారు. గంజాయి విక్రయం, వినియోగాన్ని నిరోధించడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, జిల్లా అంతటా స్పెషల్ డ్రైవ్‌లు, కార్డన్ సెర్చ్, వాహనాల తనిఖీ తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. గంజాయి వల్ల కలిగే దుష్పరిణామాలపై హాస్టల్స్, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు.



వివరాలు వెల్లడిస్తున్న సౌత్‌జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్

ఏజెన్సీ సమాచారం

వారం వ్యవధిలో
నలుగురు చిన్నారుల మృతి

మలేరియా, టైఫాయిడ్, శ్వాస కోస సమస్యలే కారణమా?



భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందిన చెందిన బాలుడు (ఫైల్).



చదలవాడలో మృతి చెందిన పసిబిడ్డ వద్ద రోదిస్తున్న కుటుంబీకులు (ఫైల్)

చింతూరు, ఆగస్టు 4: వారం వ్యవధిలో నలుగురు చిన్నారులు మృతి చెందడం మన్యంలో ఆందోళన కలిగిస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని వేర్వేరు గ్రామాల్లో ఈ దురదృష్టకర ఘటనలు చోటుచేసుకున్నాయి. కన్నాపురానికి చెందిన సవలం కన్నారావు-నాంచారమ్మ దంపతుల మూడు నెలల పసిబిడ్డ శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిపడుతోంది. అంతేగాక తరచూ వాంతులు కూడా అవుతున్నాయి. దీంతో భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి గురువారం తీసుకెళ్లారు. శనివారం ఉదయం వరకు చికిత్స అందించిన వైద్యులు మధ్యాహ్న సమయానికి పరిస్థితి విషయమించిందని చేతులెత్తేశారు. చేసేదిలేక మరో ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే బిడ్డ ప్రాణాలు లేవని రెండో ఆసుపత్రి వైద్యులు స్పష్టం చేశారు. కన్నాపురం సమీపంలోని గంగన్నమెట్టలో కన్నారావు బంధువైన సున్నం దుర్గారావు రెండు నెలల పసిబిడ్డ కూడా శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది పడుతూ ఆరు రోజుల క్రితం మృతి చెందింది. ఇదే మండలం లోని బొడ్డుగూడేనికి చెందిన సమ్మక్క 13 నెలల కూతురు జ్వరం బారిన పడింది. ముందుగా చింతూరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో భద్రాచలం ఆసుపత్రికి తరలిస్తుండగా ఆ పసి బిడ్డ మార్గమధ్యంలో మృతి చెందింది. చదలవాడకు చెందిన సొందల దేవిరెడ్డి -భద్రమ్మ 11 నెలల పసిబిడ్డ టైఫాయిడ్ బారిన పడింది. రెండు రోజుల పాటు చింతూరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందించగా ఈ నెల 2వ తేదీన మృతి చెందింది. కాగా మరణాల విషయాన్ని చింతూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకెళ్లగా సమీక్షిస్తున్నామని చెప్పారు.

పుట్టిన ప్రతి బిడ్డా మృతే

● ఇప్పటికి ముగ్గురు అదే తీరున ప్రాణాలొదిలారు

● శోక సంద్రంలో తల్లిదండ్రులు



కన్నాపురానికి చెందిన దంపతులు సవలం కన్నారావు, నాంచారమ్మలు

చింతూరు, ఆగస్టు 4: ఆ దంపతులకు పుట్టిన ప్రతి బిడ్డ మృత్యువాత పడుతోంది. ఇప్పటికి ముగ్గురు మగ బిడ్డలు ఒకే తీరున మృతి చెందడంతో ఆ తల్లిదండ్రుల ఆవేదన అంతాఇంతా కాదు. అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతూరు మండలం, కన్నాపురంలో చోటుచేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు. కన్నాపురానికి చెందిన కన్నారావు నాంచారమ్మల మూడు నెలల పసిబిడ్డ శ్వాసతీసుకోవడంలో ఏర్పడ్డ ఇబ్బందికి తోడు వాంతుల బారిన పడి శనివారం మృతి చెందింది. దీంతో ఆ తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఐతే ఈ దురదృష్టకరమైన ఘటన ఆ కుటుంబంలో ఇదే మొదటిది కాదు. ఇప్పటికి ఇది మూడోసారి కావడం విశేషం. కన్నారావు నాంచారమ్మల వివాహం 2019లో జరిగింది. తొలుత వారికి ఒక మగ బిడ్డ జన్మించింది. కాగా మూడు నెలల వయస్సులో ఆ బిడ్డ శ్వాస తీసుకునే విషయంలో ఇబ్బంది పడుతూ మృతి చెందింది. ఆ పిదప మరో మగ బిడ్డకు ఆ తల్లి జన్మనిచ్చింది. ఆ బిడ్డ కూడా అదే తీరున మూడు నెలల వయస్సులోనే మృతి చెందినది. తాజాగా మరో బిడ్డకు నాంచారమ్మ దంపతులకు కలగింది. ఐతే ఈ బిడ్డకు కూడా శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది మొదలైంది. దీంతో ఎట్లాగైనా బిడ్డ ప్రాణాలు కాపాడుకోవాలని ఆ తల్లిదండ్రులు తపించారు. ఈ మేరకు తమవద్దనున్న సొమ్ములన్ని పట్టుకొని భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి పరుగులు తీసారు. అక్కడ మూడు రోజుల పాటు చికిత్స జరిగింది. ఎంతఖర్చుకైనా వెనుకాడేదిలేదని ఆ దంపతులు భావించారు. తల తాకట్టుపెట్టైన బిడ్డ ప్రాణాలు నిలుపుకోవాలని వారు పట్టుపట్టుకకూర్చున్నారు. రాత్రింబవళ్ళు నిద్రాహారాలు మానారు. ఐతే వారి ఆశలు అడియాసలయ్యాయి. చివరకు ఈ బిడ్డకూడా తుదిశ్వాస విడచింది. దీంతో ఏమి తోచని స్థితిలో ఆ దంపతులు కొట్టుమిట్టాడు తున్నారు.

తగ్గిన గోదావరి

● వరద నీటిలోనే అమ్మవారికి నైవేథ్యం సమర్పణ



గండి పోశమ్మ గుడివద్ద తగ్గిన గోదావరి

దేవీపట్నం, ఆగస్టు 4: గత 20 రోజుల నుంచి మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయం వరద నీటిలోనే ఉండిపోయింది. కొంత మేర వరద తగ్గుముఖం పట్టడం ఆలయ గోపురం బయట పడడంతో ఆలయాధికారులు అమ్మవారికి ఆదివారం నైవేథ్యం సమర్పించారు. వరదనీటిలోనే బోటులో వెళ్లి అమ్మవారికి నైవేథ్యం సమర్పించారు. వరదలవల్ల అమ్మవారి దర్శనాలు తాత్కాలికంగా నిలుపుదల చేశామన్నారు. ఆలయ చుట్టుపక్కలకు ఎవరూ రాకూడదన్నారు. ఎప్పటికప్పుడు పోలీసులు ఇక్కడే గస్తీ కాస్తున్నారు.

ఆదివాసీ సాంస్కృతిక సంఘం నూతన కార్యవర్గం

రంపచోడవరం, ఆగస్టు 4: ఆదివాసీ (గిరిజన) ఉద్యోగుల సంక్షేమ, సాంస్కృతిక సంఘం జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం రంపచోడవరంలో జరిగింది. 22 మండలాల్లోని 12 జాతులకు సంబంధించి ఈ సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కత్తుల ఆదిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కురసం ఫకీరుదొర, ముగ్గురు కోశాధికారులు, ముగ్గురు ఉపాధ్యక్షులు, ఐదుగురు సహాయ కార్యదర్శులు, నలుగురు జిల్లా గౌరవాధ్యక్షులు, ఇద్దరు న్యాయసలహాదారులు, ఇద్దరు జిల్లా ప్రచార కార్యదర్శులు, ఇద్దరు సాంస్కృతిక కార్యదర్శులు, ముగ్గురు సలహాదార్లు ఎన్నికయ్యారు. ఆదివాసీ హక్కుల కోసం నిరంతర పోరాటాలు సాగించడం, రంపచోడవరంలో ఆదివాసీ భవన్ పూర్తి చేయడం, 12 ఆదివాసీ తెగల నిరుపేద విద్యార్థులకు విద్యానిధిని ఏర్పాటు చేయడం వంటి తీర్మానాలు చేశారు.

అడ్డతీగల మద్యం షాపులో అగ్ని ప్రమాదం

అడ్డతీగల, ఆగస్టు 4: అడ్డతీగల బ్రాందిషాపు ఆదివారం అగ్ని ప్రమాదానికి గురైంది. ఆదివారం వేకువజామున స్థానిక బ్రాందీషాపులో నుంచి పొగలు బయటకు రావడంతో స్థానికులు అడ్డతీగల పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే బ్రాందీషాపు సిబ్బందికి తెలియజేయడంతో షాపు తెరిచేటప్పటికి దట్టమైన పొగమంటలు వ్యాపించాయి. దీంతో స్థానికులు సహకారంతో మంటలను అదుపు చేశారు. ఈ విషయం ఉన్నత అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లడంతో రంపచోడవరం ఎక్సైజ్ అధికారులు రంగంలోకి దిగి అగ్ని ప్రమాదం వలన ఎంత నష్టం అంచనా వేస్తున్నారు. ప్రమాదం జరిగే సమయానికి సుమారు ఎనిమిది లక్షల సరుకు షాపులో ఉన్నట్టు సిబ్బంది తెలిపారు. సుమారు రెండులక్షల విలువైన మద్యం ధ్వంసమైనట్లు అంచనా వేస్తున్నారు. విద్యుత్‌సార్టుసర్క్యూట్ వలన జరిగి ఉండవచ్చునని విద్యుత్ అధికారులు తెలిపారు.

వరినాట్లలో నిమగ్నం

మోతుగూడెం, ఆగస్టు 4: మోతుగూడెం పరిధిలోని చదలవాడ పంచాయతీలో గిరిజన రైతులు వరినాట్ల పనిలో నిమగ్నమయ్యారు. ఎత్తైన ప్రాంతాల్లో వరి పొలాలు సాగు చేయడం వల్ల నారుమడుల పొలాలు కోతకు గురికాలేదన్నారు. వర్షపు నీరు దిగువ ప్రాంతాలకు ఎప్పటికప్పుడు దిగిపోవడంతో వరి సాగుకు ఎటువంటి ఇబ్బందీ తలెత్తలేదని రైతులు చెబుతున్నారు.

రామవరంలో శతాధిక వృద్ధురాలు మృతి



అనపర్తి, ఆగస్టు 4: అనపర్తి మండలం రామవరంలో ఆదివారం శతాధిక వృద్ధురాలు కొవ్వూరి గవరయ్యమ్మ (100) అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు కుమారుడు, కుమార్తెతోపాటు 48మంది మనుమలు, మునిమనుమలు ఉన్నారు. ఐదుతరాలనుచూసిన శతాధిక వృద్ధురాలు ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఇంటి వద్దనే మృతి చెందారు. ఆమె మృతిపట్ల ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సంతాపం ప్రకటించారు.



కొంతమూరు దానవాయిబాబు గుడి జాతరలో ఎమ్మెల్యే గోరంట్ల

ఘనంగా దానవాయిబాబు జాతర

● ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 4 : రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు దానవాయిబాబు గుడి జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. ఆదివారం ఈ ఉత్సవానికి ముఖ్యఅతిథిగా రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆలయకమిటీ పెద్దలు గోరంట్లకు ఘనస్వాగతం పలికారు. అనంత రం ఆ ప్రాంతంలో ప్రజల సమస్యలను ఆయన తెలుసుకున్నారు. డ్రైనేజీ నిర్మాణాలు, జలమిషన్ ప్రథ కంలో ప్రతీ ఇంటికి గోదావరినీరు వచ్చేవిధంగా పైప్‌లైన్ ఏర్పాటుచేసి కుళాయి మంజూరు అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటామని గోరంట్ల హామీ ఇచ్చారు. అనంతరం కొంతమూరులో అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ కార్యకర్త సీతారాంను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో దండమూడి సత్యసాయిప్రసాద్, ఈశ్వరుడు, తాడేపల్లి నాగరాజు, ఉండవల్లి బంగారాజు, దండమూరి శ్రీహరి, గోక శ్రీను, కంటిపూడి పట్టాభి, పాలడుగుల ఆలి, విపర్ల వీరబాబు పాల్గొన్నారు.

● కాతేరులో సమస్యల పరిశీలన

కాతేరు గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను టీడీపీ హెల్త్‌విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గో రంట్ల రవిరామ్‌కిరణ్ పరిశీలించారు. ఈసందర్భంగా కాతేరులో సచివాయలం-1, పంచాయతీ ఈకే కే హనుమంతరావుతో చర్చించారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆదేశాలతో కాతేరు గ్రామంలో సమస్యలను పరిష్కరించడానికి చర్యలు చేపట్టామన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం, మురుగుకాలువల పనులు ఆలసత్వం వలన ప్రజలు అనేక ఇబ్బందులకు గురతున్నారని తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

యథేచ్ఛగా నిల్వ మాంసం విక్రయాలు

● పట్టించుకోని అధికారులు ● బెంబేలెత్తుతున్న ప్రజలు



చక్రద్వారబంధంలో అపారిశుధ్యం చెంతన మాంసం, చేపల విక్రయ దుకాణాలు

రాజానగరం, ఆగస్టు 4 : జిల్లాలో ఓ వైపు డయేరియా వణికిస్తుంటే, మరోవైపు జోరుగా సాగుతున్న నిల్వ మాంసం, చేపల విక్రయాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గ్రామాల తోపాటుగా మండల కేంద్రాల్లో సైతం నిల్వమాంసం విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. మాంసా హారప్రియుల మక్కువనే అలుసుగా చేసుకుని దుకాణదారులు రెచ్చిపోతున్నారని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదివారం అయితే ఇంక చెప్పనలవి కాదని, వారం పొడువునా విక్రయించగా మిగిలిన కోళ్లు, మేకలు, గొర్రె మాంసంతో పాటుగా చేపలు, రొయ్య, పీతలను ఫ్రిజ్, ఐస్ బాక్సుల్లో ఉంచి వారాంతంలో జోరుగా విక్రయిస్తూ, ప్రజలకు రోగాలు అంటగడుతున్నారని మాంసాహార ప్రియులు వాపోతున్నారు. మాంసం దుకాణాల నిర్వహణపట్ల సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుట్టగొడు గుల్లా పుట్టుకొస్తున్న నిల్వమాంసం, చేపల దుకాణాలపట్ల సంబంధిత ప్రభుత్వ అధికారులు, వైద్యులు తమకేమీ పట్టన ట్లుగా వ్యవహరిస్తున్నారు. నిజానికి వ్యాపారులు మేక, గొర్రె తదితర జంతువుల మాంసం విక్రయించే ముందు వ్యాపారులు సదరు జంతువులను పశువైద్యాధికారి పరీక్షించిన తర్వాత స్థానిక పంచాయతీ అధికారులు ఆరోగ్యవంతమైనదని నిర్ధారించిన తర్వాత స్టాంప్‌వేసి గ్రామస్థుల సమక్షంలో దుకాణదారులు మాసం విక్రయించాల్సి ఉంటుంది. ఇది ఎక్కడా కానరాకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా చచ్చిన మేకలు, కోళ్లు, చేపలను జోరుగా విక్రయిస్తున్నారు. నిల్వమాంసం, చేపలు విక్రయాలు మూలంగా ప్రజలు అనారోగ్యం బారినపడే అవకాశం ఉందని, ఇప్పటి సంబంధిత అధికారులు నిల్వమాంసం, చేపల విక్రయాలను అరికట్టి ప్రజల్ని రోగాల బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర

బిక్కవోలు, ఆగస్టు 4: రంగాపురం గ్రామ దేవతగా పూజలందుకుంటున్న ముత్యాలమ్మ జాతర శనివారంరాత్రి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈయన వెంట కూటమి నేతలు కనుమూరి సాయిరాజు, చిరంజీవిరాజు, అప్పలస్వామి, శ్రీధర్ పాల్గొన్నారు.



రంగాపురంలో ముత్యాలమ్మను దర్శిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులు

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నా

● ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఆగస్టు 4: ఎన్డీయే కూటమి అధికారం చేపట్టిన రెండునెలల్లో అనపర్తి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నాం"ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం అనపర్తిలోని ఎన్డీయే కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చిన రెం డు నెలల్లోనే రంగంపేట మండలంలో రెండు ప్రధాన రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించామని అవి త్వరలోనే పూర్తి కానున్నాయన్నారు. సామర్లకోట వేమగిరి కెనాల్‌రోడ్డు మరమ్మతులకు రూ.5.70కోట్లు, రామవరం, రాయవరం రహదారికి రూ.1.50కోట్ల నిధులు సమీకరించామని త్వరలో నే పనులు ప్రారంభమవుతాయన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలాల్లో ఏడు ఆలయాల అభివృద్ధికి సుమారు 9కోట్ల నిధులు మంజూరుకు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూత్రప్రాయంగా అంగీకరించారని నిధుల మంజూరుకు ప్రజావిరాళం సేకరణ పూర్తిచేసిన కమిటీలకు మొదటి ప్రాధాన్యం లభిస్తుందన్నారు. బిక్కవోలులోని లక్ష్మీగణపతి ఆలయం పునర్నిర్మాణానికి స్థల సేకరణ చేయాల్సి ఉందని ప్రజలు ప్రజావిరాళంగా భూమిని సేకరిస్తే రూ.3కోట్ల రూపాయల నిధులు ఆలయ నిర్మాణానికి మంజూరు చేసేందుకు దేవదాయశాఖ సిద్ధంగా ఉందన్నారు. అనపర్తి రైల్వే సమస్యల పరిష్కారం కోసం ఎంపీ పురందేశ్వరితో కలిసి డీఆర్‌ఎంతో చర్చించామని అనపర్తిలో జన్మభూమి హాల్ట్ ఇచ్చేందుకు ఆయన సానుకూలంగా స్పందించారని అన్నారు. కెనాల్ రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టేందుకు ఎంపీ పురందేశ్వరితో కలిసి కేంద్ర మంత్రి గడ్కారీని కలవనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, తమలంపూ డి సుధాకర రెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, మామిడిశెట్టి శ్రీను, నూతిక బాబూరావు, బాసి, ఒంటిమి సూర్యప్రకాష్, చింతా ప్రకాశరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'నేరాల నియంత్రణలో
సీసీ కెమేరాలు కీలకం'



కడియం అమ్మవారి ఆలయంలో సీసీ కెమేరాను పరిశీలిస్తున్న సీఐ తులసీధర్

కడియం, ఆగస్టు 4: నేరాల నియంత్రణ, కేసులు చేధించడంలో సీసీ కెమేరాలు ప్రముఖపాత్ర పోషిస్తాయని సీఐ తులసీధర్ తెలిపారు. మండల కేంద్రమైన కడియం దేవీచౌక్ సెంటర్‌తోపాటు ప్రధాన కూడళ్లలో సీసీ కెమేరాలను పరిశీలించారు. ఈ సీసీ కెమేరాలను సీఐ తులసీధర్, ఉపసర్పంచ్ వెలుగుబంటి నానితో కలిసి పరిశీలించారు. గతంలో దాతల సహకారంతో ఏర్పాటుచేసిన ఈ కెమేరాలు చాలాకాలం నిర్వహణ లోపంతో పనిచేయకపోవడం గమనించిన మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి నాని సుమారు రూ.10వేలు ఖర్చుచేసి సీసీ కెమేరాలను పునరుద్ధరించారు. మండలంలో గ్రామాల ప్రజాప్రతినిధులు గ్రామాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే ఏకకాలంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు టి.దుర్గాప్రసాద్, కృష్ణసాయి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ పెరుగుతున్న వరద



చింతూరు, ఆగస్టు 4 : భద్రాచలంవద్ద గోదావరి వరద మళ్లీ పెరుగుతోంది. ఆదివారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి 37. 3 అడుగులకు చేరింది. దీంతో అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం, వరరామచంద్రపురం మండలాల నడుమ శబరినదికి గోదావరి నది ఎగపోటునిచ్చింది. ఈ క్రమంలో వర రామచంద్రపురం మండలం, కన్నాయిగూడెం, చింతరేగుపల్లి గ్రామాల నడుమ, తుష్టివారిగూడెం, వెంకన్న గూడెంల వద్ద ప్రధాన రహదారు లుపై వరద నీరు తిరిగి చేరింది. ఇక చింతూరు మండల విషయాని కొస్తే చింతూరు వరరామచంద్రపురం మండలాల నడుమ ముకునూరు సమీపంలోని వాగులో ఆదివారం సాయంత్రానికి వరద నీరు కాస్త తగ్గడంతో అటుగా రాకపోకలు పునప్రారంభమయ్యాయి. కాగా గోదావరి ఎగపోటు ప్రభావం తిరిగి ఈ వాగుపై పడే పరిస్థితి నెలకొంది.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

● పలువురికి గాయాలు

మారేడుమిల్లి,ఆగస్టు4: మారేడుమిల్లి గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు బైక్‌ను ఢీ కొట్టడంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. కరీంనగర్‌కు చెందిన రాజేష్, సాయికిరణ్ బైక్ పై మారేడుమిల్లి విహారయాత్రకు వచ్చారు. స్థానిక వీడియో సెంటర్లోని గెస్ట్ హౌస్ వెళ్ళి తిరిగి వస్తుండగా చాగట్లుకు చెందిన నలుగురు వ్యక్తులు కారులో మారేడుమిల్లికి వస్తు వారి ఎదురుగా బైక్‌పై వెళుతున్న రాజేష్, సాయికిరణ్‌లను గుద్దుకుని రోడ్డు ప్రక్కనున్న కరెంటు స్థంభాన్ని ఢీ కొట్టారు. దీంతో కరెంటు స్థంభం విరిగి పడిపోయింది. కారులో ఉన్న అశోక్, రవి, బైక్‌పై ఉన్న రాజేష్, సాయికిరణ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం రంపచోడవరం ఆసుపత్రికి తరలించారు.దీంతో సాయంత్రం గ్రామంలో కరెంటు నిలిచిపోయింది.

మాదిగల కల
కూటమి ప్రభుత్వంతోనే సాధ్యపడింది

● ఎమ్మెల్యే నల్లమిల్లికి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మార్పీఎస్ నాయకులు

అనపర్తి, ఆగస్టు 4: సుమారు 30 సంవత్సరాలుగా ఏబీసీడీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ చేసిన పోరా టం ఫలించిందని మాదిగల కలను ఎన్డీయే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యపడిందని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు నిడిగట్ల వెంకట్రావు మాదిగ అన్నారు. వర్గీక రణకు సుప్రీం కోర్టు అనుకూలంగా ఇచ్చిన తీర్పు నేపథ్యం లో అనపర్తి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని కలిసి దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాదిగ గతంలో చంద్రబాబు అసెంబ్లీలో చేసిన తీర్మానంవల్లే నేడు వర్గీక రణ సాధ్యపడింద న్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ముఖ్యంత్రి చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు ఎమ్మార్పీఎస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం లో ఎమ్మార్పీఎస్ నాయకులు నూతిక బాబూరావు, చిర్రా వరప్రసాద్, మందపల్లి సత్యనారాయణ, కె వెంకట రమణ, డోకుబుర్ర సుబ్బారావు, పైడిమళ్ళ స్వామి, తాళ్ళూరి ప్రభాకర్, బత్తిన ఆనంద్, నేకూరి అబ్రహం పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యాన్ ఢీకొని
హార్లిక్స్ ఫ్యాక్టరీ ఉద్యోగి మృతి



ఘటనాస్థలి వద్ద పడి ఉన్న వెంకట సుబ్రహ్మణ్యం

ధవళేశ్వరం, ఆగస్టు4: గుర్తు వ్యాన్ ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ధవళేశ్వరం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం వేమగిరి తోటకు చెందిన వాసంశెట్టి వెంకట సుబ్రహ్మణ్యం(55) హార్లిక్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం యూనియన్ మీటింగ్‌కు హాజరవడానికి తన నివాసం నుంచి ద్విచక్రవాహనంపై ధవళేశ్వరం ఫ్యాక్టరీకి బయల్దేరి వెళ్లాడు. స్థానిక భూలోకమ్మ గుడి సమీపానికి వచ్చేసరికి గుర్తు తెలియని వ్యాన్ ఎదురుగా వచ్చి వెంటక సుబ్రహ్మణ్యంను ఢీకొట్టి ఎడమ కాలు పైనుంచి వెళ్లడంతో కాలు నుజ్జునుజ్జయింది. స్థానికులు, బంధువులు 108 అంబులెన్స్ ద్వారా ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఎస్ఐ హరిబాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

సీతానగరం, ఆగస్టు 4: విద్యుత్ ఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన పెదకొండేపూడి గ్రామంలో చోటుచేసుకుంది. పెదకొండేపూడి గ్రామంలో ఉన్న కోళ్లఫారంలో ఆదే గ్రామానికి చెందిన కారింకుల కొండయ్య (40) అనే వ్యక్తి పనిచేస్తున్నాడు. ఆదివారం తెల్లవారు జామున సుమారు ఒంటిగంట ప్రాంతంలో కోళ్లవ్యాన్‌లో లోడింగ్ చేస్తుండగా కోళ్లఫారంలో తెగిపడివున్న విద్యుత్ వైరు తగులుకుని విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందాడు సీతానగరం ఎస్ఐ టి. రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు

అదుపు తప్పి లారీ బోల్తా

గోపాలపురం, ఆగస్టు 4: మొక్కజొన్న లోడుతో ప్రయాణిస్తున్న లారీ శనివారం రాత్రి అదుపుతప్పి గోపాలపురం శివారులో ఉన్న తాడిపూడి ఉపకాల్వలో బోల్తా పడింది. వరంగల్ నుంచి మొక్కజొన్న లోడుతో దేవరపల్లి మండలంలోని ఒక పరిశ్రమకు వెళ్తుండగా మార్గమధ్యంలో ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికుల తెలిపారు. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్పగాయాలు కావడంతో కొయ్యలగూడెంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు.

అలరించిన సంగీత విభావరి



జిత్ మోహన్‌మిత్ర ఆర్కెస్ట్రాతో కిషోర్‌కుమార్ సంగీత విభావరి

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 4: హిందీ గాయకుడు కిషోర్‌కుమార్ 96వ జయంతి కార్యక్రమం స్థానిక జిత్ మోహన్‌మిత్ర కళావేదికలో ఆదివారం జరిగింది. ఆర్కెస్ట్రా పితామహుడు, నట గాయకుడు శ్రీపాద జిత్ మోహన్‌మిత్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముద్రగడ ఏసబాబు జ్యోతి ప్రజ్వలనం చేశారు. జిత్ మోహన్ మిత్ర మాట్లాడుతూ కిషోర్‌కుమార్ భారతీయ చలన చిత్ర పరిశ్రమలో పలు పాటల పాడి, భారతీయుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని, తన ఆర్కెస్ట్రా ద్వారా కిషోర్ పాటలు పాడి, ఆంధ్రా కిషోర్‌గా గుర్తింపు పొందాని అన్నారు. శ్రీపాద మిత్ర, వి.బాలకృష్ణ, విశ్వనాథ్, హరి, గంగాకిషోర్, కృష్ణ తదితరులు కిషోర్‌కుమార్ పాటలు పాడి, స్వరనీరాజనం అర్పించారు. కార్యక్రమంలో ఎస్‌.శ్రీనివాస్, అడబాల మరిడయ్య, ఎఎస్‌ఆనంద్, టి.శ్రీనివాస్, ఎ.కృష్ణశర్మ, ఎ.లక్ష్మణరావు సీతామహలక్ష్మి పాల్గొన్నారు.

డ్యాన్స్ మాస్టర్స్, డ్యాన్సర్స్ అసోసియేషన్ సమావేశం



మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్

ధవళేశ్వరం, ఆగస్టు 4: రిథమ్ ఆఫ్ ఆంధ్ర డ్యాన్స్‌మాస్టర్స్ అండ్ డ్యాన్సర్స్ అసోసియేషన్ జిల్లాస్థాయి సమావేశం ఆదివారం స్థానిక జ్యోషి డ్యాన్స్ అకాడమీలో నిర్వహించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ప్రసాద్, హరీష్, అధ్యక్షుడు సతీష్, ఉపాధ్యక్షుడు జ్యోషి తదితరులు మాట్లాడుతూ సంఘం ద్వారా డ్యాన్సర్స్‌కు అవసరమైన సేవలు అందించడానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు డ్యాన్సర్‌లు, మహిళా డ్యాన్సర్‌లు మాట్లాడుతూ తాము ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న డ్యాన్సర్లతో పాటు డ్యాన్స్ మాస్టర్లు విజయ్, కాశీ, శివప్రసాద్, ఈశ్వర్, రాజా, చక్రి పాల్గొన్నారు.

ఫ్రెండ్‌షిప్ డే సందడి

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 4: తమ స్నేహం 50 వసంతాలు దాటినా, తమ స్నేహబంధం ఎంతో మధురమైనదని, బలమైందని డాక్టర్ దాట్ల భాస్కరరాజు అన్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా, స్థానిక వెంకటేశ్వరనగర్ ఐఎంఏ హాలులో డాక్టర్ దాట్ల బలరామరాజు ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం వీటీ జూనియర్ కాలేజీ 1972-74(బైపీసీ) బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన సభలో ఆయన మాట్లాడుతూ, అన్ని బంధాల కంటే స్నేహబంధం ఎంతో విలువైనదని, 50 ఏళ్ల తరువాత తమ స్నేహితులందరూ కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. తొలుత వీరేశ లింగం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల మృతిచెందిన మిత్రులకు సంతాప సూచకంగా మౌనం పాటించారు. ఎం.ఆదివిష్ణు, ప్రసిదరాజు, గంగాధర్, కామరాజు, సప్పా రామకృష్ణ, బి.ఉమా మహేశ్వరరావు, వి.మహారాజు, కె.దారేశ్వరరావు, సీతా రామయ్య, కె.అశోక్‌బాబు, సీతారామయ్య, అబ్రహాం లింకన్, ఎస్.బసవేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరమ్మ జయంతోత్సవం



జాంపేట ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో చౌడేశ్వరీ అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరంకల్చరల్, ఆగస్టు 4: రాజమహేంద్రవరం జాంపేట శ్రీఉమా రామలింగేశ్వరస్వామి కల్యాణ మండపంలో దేవాంగ కులదేవత శ్రీ చౌడేశ్వరమ్మ జయంతోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6గంటల నుంచి ప్రారంభమైన అమ్మవారి అర్చనలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని గణపతి పూజ, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నగర పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో దేవాంగ సంఘం అధ్యక్షుడు రొబ్బి విజయ శేఖర్, కాలెపు సత్యనారాయణ మూర్తి, పడాల సూర్యకోటేశ్వరరావు, చింతా వెంకట చలపతిరావు, కేకే సంజీవరావు, పుచ్చల రామకృష్ణ, పడాల వీరభద్రరావు, బీరా శ్యామలరావు పాల్గొన్నారు.

ఆర్గానిక్ సబ్బుల తయారీలో
వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గోకవరం మహిళకు చోటు



వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న లలితజ్యోతి

గోకవరం, ఆగస్టు 4: ఆర్గానిక్ సబ్బుల తయారీలో గోకవరంనకు చెందిన మహిళకు ఓ అరుదైన గౌరవం దక్కింది. ఒక నిమిషంలో ఎక్కువ ఆర్గానిక్ సబ్బులు తయారీలో దామోదర లలితజ్యోతి అనే మహిళ వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకొంది. జూన్ 26న బెంగుళూరుకు చెందిన క్లాసెస్ సంస్థ అధినేత వి.మృదులారెడ్డి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో జూమ్ ద్వారా ఒక నిమిషంలో ఎక్కువ ఆర్గానిక్ సబ్బుల తయారీపై పోటీ నిర్వహిం చారు. ఈపోటీలో 27మంది బృందంగా ఏర్పడి 2008 సబ్బులను తయారీ చేసి వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటుదక్కించుకున్నారు. వీరిలో ఓ సభ్యురాలైన గోకవరంనకు చెందిన లలితజ్యోతికి ఆదివారం వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి మెడల్, సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఈసందర్భంగా లలితజ్యోతిని పలువురు అభినందించారు.

ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



తూర్పుగోదావరి
జిల్లా వార్తలు

సోమవారం 5 ఆగస్టు 2024 | 5

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 4 : ప్రజాసమస్యల పరిష్కార వేదిక జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.అమరావతిలో ఈ నెల 5,6 తేదీల్లో సీఎం చంద్రబాబు జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహిస్తున్నందున పీజీఆర్ఎస్‌కు హాజరుకాలేనన్నారు. కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి జేసీ జీ.నరసింహులు, ఇతర అధికారులు అర్జీలు స్వీకరిస్తారన్నారు.

మళ్లీ నీట మునిగిన శ్రీరంగపట్నం

కోరుకొండ, ఆగస్టు 4 : ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు కాలువలు పొంగుతున్నాయి.. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో పెద్ద ఎత్తున వరదనీరు బురద కాలువకు చేరుతుంది. ఈ నేపథ్యంలో బురద కాలువ వరద నీరు శ్రీరంగపట్నం గ్రామంపై మరోసారి రోడెక్కింది. సూరంపాలెం రిజర్వాయర్ నుంచి మిగులు జలాలను బురద కాలువ నుంచి వదలడంతో ఆదివారం శ్రీరంగపట్నం గ్రామంలోని బురద కాలువ వరద నీరు రోడ్డెక్కింది. బురద కాలువ రోడ్డు ఎక్కే ప్రదేశంలో తాత్కాలికంగా ఇసుక బస్తాలను ఏర్పాటు చేశారు.ఈ మేరకు సమాచారం అందుకున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ హుటాహుటిన శ్రీరంగపట్నం చేరుకుని వరదనీటిని పరిశీలించారు.తగిన సహాయ చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. సర్పంచ్ మద్దాల రమణ, తనకాల నాగేశ్వరరావు,మళ్ళ అప్పల నర్సారావు, గ్రామస్థులు ఉన్నారు. బురద కాలువ సమస్య శాశ్వత పరిష్కారా నికి చర్యలు తీసుకోవాలని కోరారు.



శ్రీరంగపట్నంలో రోడ్డుపై పారుతున్న బురద కాలువ నీరు

నీటిలో దిగి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

నెమ్మదిగా పెరుగుతున్న గోదావరి

రాజమహేంద్రవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి)/ ధవళేశ్వరం : గోదావరి మళ్లీ స్వల్పంగా పెరుగుతుంది. ప్రమాద హెచ్చరికల స్థాయికి రాకపోవచ్చని అధి కారులు చెబుతున్నారు. భద్రాచలం వద్ద 33 అడుగల వరకూ తగ్గిపోయిన వరద ఆదివారం రాత్రి 8 గంటలకు 37.50 అడుగులకు చేరింది.ఇది నెమ్మదిగానే పెరిగింది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 8.30 అడుగులకు తగ్గిన వరద ఆదివారం రాత్రి 7 గంటలకు నీటిమట్టం 8.60 అడుగులుగా నమోదైంది. ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో ధవళేశ్వరం వద్ద నీటిమట్టం స్వల్పంగా పెరుగుతుంది. 5,83,757 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుంది.ఇది ఇంకొంచెం పెరిగే అవకాశం ఉంది. దీంతో గోదావరి పరీవాహక రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గత రెండు వారాలుగా గోదావరి భయపెట్టింది.అయితే ఎగువన వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గత రెండు రోజులు గోదావరి శాంతించింది.మళ్లీ నెమ్మదిగా పెరుగుతుండడంతో ఆందోళన చెందుతున్నారు.



ధవళేశ్వరం వద్ద నిలకడగా గోదావరి ప్రవాహం



పోలీస్..కూలీ!

హోంగార్డుల జీవితం దుర్భరం

అధికారులకు, హోంగార్డులకు ఒకటే రంగు ఖాకీ యూనిఫాం. ఇద్దరినీ పోలీస్ అనే పిలుస్తారు.. అయితే చేసే పని మాత్రం వేరు.. తమ తోటి ఉద్యోగి అనే ఆలోచనే ఉండదనుకుంటా.. అసలు వారి గురించి పట్టించుకునే వారే ఉండరు.. మీ సమస్యలన్నీ పరిష్కరిస్తాం అంటూ తమ శాఖలో సిబ్బందికి హామీలిచ్చే ఉన్నతాధికారులు..వాళ్ల చుట్టూ తిరిగే వాళ్లను మాత్రం హీనంగా చూస్తున్నారు.. హోంగార్డు ఉద్యోగం కూలీ కంటే హీనంగా తయారైంది.. ఉపాధి హామీ కూలీకైనా ఇన్ని గంటలు పని అని ఒక లెక్క ఉంటుంది. వీళ్లకు అదేం లేదు.. సార్ చెబితే చేయాల్సిందే.. లేదంటే అంతే. సెలవులు ఉంటాయా అంటే అదీలేదు.. జీతమూ అంతంతమాత్రమే.. పోనీ ఉద్యోగ భద్రత ఉంటుందా అంటే అదీ బాస్ కెరుక.. వాళ్లకు కోపం వచ్చిందంటే ఉద్యోగం ఊడుద్ది.. ప్రభుత్వం జీతం ఇస్తున్నా.. పనిమాత్రం పోలీస్ బాసల ఇళ్లవద్దే.. యూనిఫాం సర్వీసులో అత్యంత అల్పజీవులుగా, చులకన బతుకులుగా ఏళ్ల తరబడి ఒకే క్యాడర్‌లో నలిగిపోతున్న హోంగార్డుల వెతలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

బ్రిటిష్ వాళ్లను మనం దేశం నుంచి తరిమికొట్టినా కొన్ని రంగాల్లో మాత్రం నేటికీ బానిసత్వం కొనసాగుతోంది. అలాంటి వ్యవస్థల్లో హోంగార్డులు ముందు వరుసలో ఉంటారు. పేరుకే పోలీస్ ఉద్యోగం.. చేసేది మాత్రం కూలి పనికంటే దారుణం.. హోంగార్డులకు ఉద్యోగ భద్రతే కాదు హెల్త్ ఇన్సూరెన్స్ వంటివి లేవు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో పోలీసులు, సిపాయిలకు, ప్రజలకు సహాయకులుగా హోంగార్డు వ్యవస్థ పురుడు పోసుకుంది. అప్పట్లో వీరిని 'సేవకులు(వాలంటీర్)'గా అభివర్ణించడంతో ఎన్నో ఏళ్లు గడిచినా అదే పేరుతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారు. ఇటు ప్రభుత్వోద్యోగులా.. అటు ప్రైవేటు ఉద్యోగులా అన్న విషయం ఇతమిద్దంగా చెప్పలేని దుస్థితి. ప్రభుత్వ ఉద్యోగులు మాదిరిగా సీఎఫ్ఎంఎస్ కోడ్ ఉండడంతో సంక్షేమ పథకాలు వర్తించడం లేదు. పీఎఫ్, టీఏ, డీఏ వంటివి ఇవ్వడం లేదు. బందోబస్తుకు వెళ్లినా సొంత సొమ్ము ఖర్చు చేసుకోవాల్సిందే.తర్వాత అధికారుల దయను బట్టి ఆ డబ్బులు వస్తే అదృష్టమే. ఎవరైనా మరణించినా అంత్యక్రియల తర్వాత ఎప్పుడో రూ.25 వేలు వస్తాయంతే. ఈలోపు సహచర ఉద్యోగులు కాస్త మానవత దృక్పథం కలిగిన అధికారులు ఎంతో కొంత పోగేసి బాధిత కుటుంబం చేతిలో పెడతారు. రిటైర్మెంట్ అయిన రోజున మరీ అవమానకరంగా ఉద్యోగ జీవితం ముగుస్తుంది. ఏళ్ల తరబడి హోంగార్డుగా పనిచేసినా చివరి రోజున వచ్చే జీతాన్నే చేతిలో పెట్టి సాగనంపుతారు. రిటైర్ అయినా ఉద్యోగికి సహచర హోంగార్డులు ఒకరోజు జీతం విరాళంగా అందించి తమలో తామే గౌరవించుకుంటారు.

ఇళ్లలో పాచి పనులూ చేయాలా?

మహిళా హోంగార్డుల దుస్థితి చూస్తే కళ్లు చెమరుస్తాయి. పోలీస్ అధికారుల ఇళ్లల్లో పాచి పనులు చేసే పనోళ్లగా మహిళా హోంగార్డులను వినియోగిస్తున్నారు. 'పలానా సార్ ఇంట్లో బట్టలు ఉతకాలట. మహిళా హోంగార్డును పంపండి' ఫోన్ వచ్చిన వెంటనే అందుబాటులో ఉన్న వారు ఆ అధికారి ఇంటికి పరుగు పెట్టాల్సిందే. ఒకవేళ ఇళ్లలో పనులకు వెళ్లలేకపోతున్నామంటూ గోడు వెళ్లబోసుకుంటే అప్పటి నుంచీ డ్యూటీల పేరుతో టార్చర్ తప్పదు.గతంలో ఎస్పీ, అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారుల ఇళ్లల్లో కూరగాయలు తీసుకురావడానికి, బయట పనులకు పురుష హోంగార్డులను.. ఇంట్లో పనులకు మహిళలను ఉపయోగించుకునేవారు. కానీ ఇప్పుడు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఇళ్లల్లో కూడా మహిళా హోంగార్డులు పాచి పనులు చేయాల్సిందే. ఉదయం 6 గంటలకు వెళ్లి గిన్నెలు తోమడం, తడిగుడ్డలు పెట్టడం, బట్టలు ఉతకడం, బాత్రూంలు కడగడం,పిల్లలకు స్నానాలు వగైరా చేయించడం, వాకిలి తుడవడం, వంట చేయడం, వారు షాపింగ్‌కి వెళ్తే వెంట వెళ్లడం వంటివి చేయాలి. అధికారులు ఫ్యామిలీతో ఊరెళ్లినా ఇల్లు కనిపెట్టుకొని ఉండాలి. వాళ్లు వస్తున్నామంటూ ఫోన్ చేస్తే ఇంటిని అద్దంలా మార్చేయాలి. అయినా వీళ్లను అమ్మగార్లు పని మనుషుల కంటే హీనంగా చూస్తున్నారనే ఆరోపణలున్నాయి. అమ్మగారు కరుణించి పంపిస్తే సాయంత్రం ఏ మూడు, నాలుగు గంటలకో ఇంటికి చేరతారు. అయినా సరే మళ్లీ స్టేషన్ డ్యూటీ మామూలుగానే చేయాల్సి ఉంటుంది. పైగా మహిళలని కూడా చూడకుండా ఇప్పుడు స్టేషన్లలో నైట్ డ్యూటీలు వేస్తున్నారు. ముఖ్యంగా అధికారుల ఇళ్లల్లో పాచి పనులు, నైట్ డ్యూటీలు చేయలేమంటూ హోంగార్డులు నెత్తీనోరూ బాదుకుంటున్నా బాసులు మాత్రం కనికరించడం లేదు.

నాడు టీడీపీ దయ చూపింది..

2019కి ముందు టీడీపీ ప్రభుత్వం హోంగార్డులపై దయ చూపింది. జీతాన్ని రెండు సార్లు పెంచింది. మహిళా హోంగార్డులకు 160 రోజుల ప్రసూతి సెలవులు కల్పించింది. నెలకు వేతనంతో కూడిన రెండు సెలవులు ఇవ్వాలని జీవో కూడా ఇచ్చింది. మహిళలకు నైట్ డ్యూటీలు, బందోబస్తులు ఉండేవి కావు. కానీ వైసీపీ పాలనలో హోంగార్డులు తమ సర్వీసులో ఎప్పుడూ పడని ఇబ్బందులను ఎదుర్కొన్నారు.బందోబస్తులకు సుదూరంగా పంపించేవాళ్లు. అక్కడ భోజనానికి 3 కిలోమీటర్లు నడిచి వెళ్లే పరిస్థితి ఉండేది. సీఎం కార్యాలయంలో కొన్ని రాష్ట్ర స్థాయి కార్యాలయాల్లో టర్నవుట్ పద్ధతిలో పని చేయా లంటూ విధులు కేటాయించేవారు. ఇచ్చే అరకొర జీతంతో అక్కడ ఇబ్బందులు పడేవాళ్లు. బందోబస్తుకు వెళితే కనీసం టీనీళ్లకు కూడా డబ్బులు వచ్చేవి కాదు. రోజుకు వచ్చే కూలి రూ.710లోనే అన్ని ఖర్చులూ భరించుకోవాలి.

జిల్లాలో 230 మంది

జిల్లాలో 230 మంది హోంగార్డులు ఉన్నారు. వీరందరూ అప్పట్లో టీడీపీ మాదిరిగానే ఇప్పుడు కూటమి ప్రభుత్వం తమకు అనుకూలమైన నిర్ణయం తీసుకుంటుందని ఎదురు చూస్తున్నారు. ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు సామర్థ్యాన్ని బట్టి కానిస్టేబుల్‌గా అవకాశం ఇస్తారని ఆశిస్తున్నారు. ఎక్స్‌గ్రేషియా, మెడికల్ బిల్లుల వంటి సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. కొత్త ప్రభుత్వంలోని మంత్రులు, ఎమ్మెల్యేలకు ఇప్పటికే వినతి పత్రాలు అందజేశారు. జిల్లాలోని సరిపడా హోంగార్డులు లేకపోవడంతో డబుల్, ట్రిపుల్ డ్యూటీలు తప్పడం లేదు. బందోబస్తు పూర్తయిందనే లోపుగా మరో చోట విధులు కేటాయిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఒంటిపై వస్త్రాలు ఉతుక్కోడానికి కూడా సమయం లేకుండా వీరితో చాకిరీ చేయించుకున్నారు. ఎన్నికల సమయంలో దాదాపుగా ఎవరూ కూడా ఇళ్లకు వెళ్లిన దాఖలాలు లేవు.

కేటగిరీలన్నీ హుష్‌కాకి..


అధికారుల ఇళ్ల వద్ద పాచి పనులు చేయడానికి గతంలో ఆర్డర్లీ వ్యవస్థ ఉండేది. బ్రిటిష్ వలస పాలకుల నుంచి వచ్చిన ఈ దాష్టీకాన్ని తర్వాత రద్దు చేశారు. కానీ అనధికారికంగా మాత్రం ఆర్డర్లీ వ్యవస్థకు ప్రతి రూపంగా హోంగార్డు వ్యవస్థ తయారైంది. హోంగార్డులను రిక్రూట్ చేసే సమయంలో ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజిస్తారు. కానిస్టేబుల్ చేసే నైట్‌బీట్లు, క్రైం, లా అండ్ ఆర్డర్, ఆఫీస్, కంప్యూటర్ ఆపరేటర్లు, డ్రైవర్లు వంటివి 'ఏ' క్యాటగిరీ, దోబీ, మోచీ వంటివి బీ, మరణించిన వారి ఫ్యామిలీకి వచ్చే ఉద్యోగాన్ని 'సీ' కేటగిరీగా చేశారు. అయితే తర్వాత మాత్రం వీరు విధులకు ఒక పద్ధతి అంటూ ఉండదు. పైవారు ఏమి చెబితే దానికి తలాడించాల్సిందే. సెలవులు ఉండవు. వారు పనిచేస్తున్న అధికారికి దయతలిస్తేనే సెలవు దొరుకుతుంది. అది కూడా ఆ రోజు వేతనం వదులుకోవాల్సిందే. నెలంతా ఉద్యోగం చేయాల్సిందే. ఆదివారం, వీకాఫ్, పండుగలు ఉండవు.

- ఉద్యోగ భద్రత లేదు..
- వేలల్లో జీతమూ లేదు..
- నిబంధనలూ పట్టవు..
- రోజుకు కేవలం రూ.710లే
- బాస్‌ల ఇళ్ల వద్దే పని
- అంట్లు తోమడం..ఇళ్లు కడగడం
- రాత్రికి పోలీస్ స్టేషన్‌లో కాపలా
- కాదంటే సారుతో చీవాట్లు
- సెలవు పెడితే జీతం కోత
- ప్రభుత్వ పథకాలకు దూరం
- గత టీడీపీ ప్రభుత్వంలో మేలు

బతుకంతా హోంగార్డే

ప్రభుత్వ ఉద్యోగంలో ఎంత చిన్న స్థాయిలో జాయిన్ అయినా రిటైర్‌మెంట్ నాటికి ఎంతో కొంత ఎదుగుదల ఉంటుంది. కానీ హోంగార్డులు మాత్రం అదే హోదాలో ఉద్యోగంలో చేరి 40 ఏళ్ల పైబడి సర్వీసు చేసినా ఎదుగూ బొదుగూ లేకుండా అదే హోదాలో ఉద్యోగ విరమణ పొందుతారు. ఉద్యోగి బతుకంతా ఒకే కేడర్‌లో మగ్గిపోవాల్సిందే. గతంలో కానిస్టేబుళ్ల రిక్రూట్‌మెంట్‌లో 20శాతం కోటా హోంగార్డులకు ఉండేది. దానిని తర్వాత 10 శాతానికి తగ్గించేశారు. వాస్తవానికి కానిస్టేబుల్‌తో సమానంగా వెపన్, లాఠీ వంటి శిక్షణ హోంగార్డుకు ఉంటుంది. 'లా' క్లాస్‌లు మాత్రమే ఉండవు. ఉద్యోగంలో జాయినైన తర్వాత కూడా కానిస్టేబుల్‌తో సమానంగా విధులు ఉంటాయి. హోంగార్డుల విషయంలో సుప్రీం కోర్టు నిర్దేశాలను చాలా రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారు. పొరుగున ఉన్న తెలంగాణలో నెలకు రూ.28 వేలు, ట్రాఫిక్ డ్యూటీ చేసే వాళ్లకు రూ.35 వేల వరకూ వేతనం అందు తోంది. పుదుచ్చేరిలో నాలుగైదు ఏళ్లు హోంగార్డుగా పని చేస్తే కానిస్టేబుల్‌గా కన్వర్ట్ చేస్తున్నారు.

9న రంపలో చంద్రబాబు పర్యటన?



రంపచోడవరం, ఆగస్టు4: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 9న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రంపచోడవరం రానున్నారని సమాచారం. ఆయన పర్యటనపై కొంత సందిగ్ధత నెలకొంది. ఇదిలా ఉండగా ఆదివారం ఆయన పర్యటించాల్సిన ప్రాంతాలను అధికారులు లోపాయికారీగా పరిశీలించారు. ఆదివాసీ దినోత్సవానికి ప్రతి సారీ ముఖ్యమంత్రులు అరకు ప్రాంతంలో పర్యటించడం రివాజుగా మారింది. ఈ మారు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివాసీ దినోత్సవానికి రంపచోడవరం రావడానికి సుముఖత వ్యక్తం చేశారు. ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాలకు సంబంధించి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ ఖరారు కావడం, ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో పర్యటనపై సందిగ్ధత నెలకొంది. అల్లూరి సీతారామరాజు జిల్లా కూడా ఎమ్మెల్సీ ఎన్నికల పరిధిలో ఉన్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సాధ్యాసాధ్యాలను ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు.ఈ పర్యటనపై ఇంకా స్పష్టత రావాల్సి ఉందని అధికార వర్గాలు అంటున్నారు.

నేడు అమరావతిలో కలెక్టర్ల మీటింగ్

రాజమహేంద్రవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : సీఎంగా చంద్రబాబు బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలిసారిగా రాజధానిలో కలెక్టర్ల మీటింగ్ ఏర్పాటు చేశారు. తొలుత సోమ, మంగళ వారాల్లో రెండు రోజుల పాటు నిర్వహించాలని భావించారు. కానీ సీఎంకు వేరే షెడ్యూల్ ఉండడం వల్ల సోమవారం ఒక్కరోజే నిర్వహిస్తారని చెబుతున్నారు. సమావేశానికి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి హాజరవుతు న్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7.55 గంటల వరకూ జరిగే సదస్సులోవ్యవసాయం, మార్కెటింగ్, సహకార రంగం తదితర శాఖ లపై సమీక్షించనున్నారు.ఈ మేరకు జిల్లాలోని ముఖ్యశాఖల సమాచారం అంతా సేకరించారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమం హౌసింగ్, రోడ్లు వంటి సమస్యల మీద కూడా సమీక్షించే అవకాశం ఉంది.

జిల్లాలో పలువురు ఎస్‌ఐలు బదిలీ

ఉత్తర్వులు జారీ చేసిన ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 4 : తూర్పుగోదావరి జిల్లాలో పలువురు ఎస్‌ఐలను బదిలీ చేశారు. ఏలూరు రేంజ్ ఐజీ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో ఎస్‌ఐల బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. సీతానగరం ఎస్‌ఐ టి.రామకృష్ణను తాళ్ళపూడి ఎస్‌ఐగా బదిలీ చేశారు. రాజానగరం ఎస్‌ఐ వీరమళ్ళ నాగవెంకట పవన్‌కుమార్‌ను గోకవరం ఎస్‌ఐగా, బిక్కవోలు ఎస్‌ఐ పి.బుజ్జిబాబును డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట టౌన్ ఎస్‌ఐగా బదిలీ చేశారు. దేవరపల్లి ఎస్‌ఐ కె.శ్రీహరిరావును కొవ్వూరు రూరల్ ఎస్‌ఐగా, నిడదవోలు ఎస్‌ఐ ఫులపా అప్పారావును పెరవలి ఎస్‌ఐగా, తాడేపల్లిగూడెం ట్రాఫిక్ స్టేషన్ ఎస్‌ఐ వి.సుబ్రహ్మణ్యంను దేరవపల్లి ఎస్‌ఐగా, గోపాలపురం ఎస్‌ఐ కె.సతీష్‌కుమార్‌ను అక్కడే కొనసాగిస్తూ ఉత్తర్వులను ఎస్పీ నరసింహకిశోర్ జారీ చేశారు.



ఇసుక లెక్క తేల్చండి..

- సుప్రీం ఆదేశాలతో ఇసుక అక్రమాలపై విచారణ
- జిల్లా ఇసుక కమిటీ సభ్యులే విచారణాధికారులు
- రాఘవా కన్‌స్ట్రక్షన్, ప్రతిమా సంస్థపైనా కేసులు
- స్టాక్ పాయింట్లలో ఇసుక మాయంపై ఎఫ్ఐఆర్‌లు
- వైసీపీ ఇసుక దందా వెలికితీత.. 31న రిపోర్టు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)


గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో ఇసుక దోపిడీపై కూటమి ప్రభుత్వం విచారణ చేయిస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న ఇసుక కమిటీ సభ్యులతో విచారణ జరిపిస్తున్నారు. ఈ నెల 2వ తేదీన ఆదేశాలు జారీఅయ్యాయి. ఈ నెల 31వ తేదీలోపు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వవలసి ఉంది. గత వైసీపీ ఐదేళ్ల కాలంలో జిల్లాలో ఇసుక అక్రమాలు అనేకం జరిగిన సంగతి తెలిసిందే. మొదట జేపీ సంస్థకు కాంట్రాక్టు ఇచ్చి ఒకే బిల్లు మీద వందల లారీలు ఇసుక తరలించినా, సీనరేజీ ఎగ్గొట్టినా ఎవరూ పట్టించుకోలేదు. గతేడాది మేలోనే ఈ సంస్థ కాంట్రాక్టు పూర్తయిపోయినప్పటికి అదే కంపెనీ బిల్లులతో వైసీపీ పెద్దలు గోదావరిలో పడి ఇసుకు దోచేసిన సంగతి తెలిసిందే. అనంతరం టెండర్లు పిలవకుండా నెలకు ఇన్ని కోట్లు ఇవ్వాలని గుత్తబేరం కుదుర్చుకున్నారు. దీనిలో భాగంగా అనధికారికంగా డ్రెడ్జింగ్‌కు అనుమతివ్వడంతో ఆర్కే అనే వ్యక్తి రాత్రీ పగలూ ఇసుక దోపిడీ చేసిన సంగతి తెలిసిందే. ఇసుక కుంభకోణంలో కొవ్వూరుకు చెందిన ప్రేమరాజ్ అనే వ్యక్తి బలయ్యాడు. గత డిసెంబర్ వరకూ ఇష్టానుసారం దోచుకున్నారు. అయితే సుప్రీంకోర్టు ఆదేశాలతో తామంతా సక్రమంగానే చేస్తున్నామనే రికార్డులు సృష్టించడం కోసం మూడేళ్ల కిందట డ్రెడ్జింగ్‌కు ఒప్పందం కుదుర్చుకున్న రాఘవాకన్‌స్ట్రక్షన్ కంపెనీని ముందుకు తెచ్చారు. ఆ సంస్థ పేరిట అన్ని ర్యాంపులలో డ్రెడ్జింగ్ చేశారు. కానీ ప్రభుత్వం మారడంతో కాంట్రాక్టర్లంతా పరారయ్యారు.ఇక్కడ జరిగిన కోట్లాది రూపాయల ఇసుక అక్రమాలు బయటపడుతున్నాయి.అక్రమాల్లో ఇసుక వ్యాపారి బలన్మరణం చెందిన సంఘటన నుంచి ఆర్కే అనే వ్యక్తితో వైసీపీ చేయించిన దోపిడీ లన్నీ వెలికి తీయనున్నారు. జిల్లాలో ఇప్పటికే రాఘవా కన్‌స్ట్రక్షన్ కంపెనీ, ప్రతిమా సంస్థలపై కేసులు పెట్టారు. ఉసులుమర్రు, పందలపర్రు స్టాక్ పాయింట్ల విషయంలో కూడా కేసులు పెట్టారు.కొవ్వూరులో ఎర్రమ్మ ర్యాంపు వద్ద అక్రమాలకు కారణం రాఘవా కన్‌స్ట్రక్షన్ కంపెనీయేనని కొవ్వూరు లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.అవినీతి వెలుగులోకి వస్తే వైసీపీ పెద్దలు, తప్పుడు రిపోర్టులు ఇచ్చిన అప్పటి కలెక్టర్, ఎస్పీలు ఇరుక్కునే అవకాశం ఉంది.

ఉద్యాన పంటల నిధులు విడుదల



రాజమహేంద్రవరం రూరల్/కడియం ఆగస్టు4: ఉద్యాన పంటలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు అందించే దిశగా 2023-24 సంవత్సరానికి సంబంధించి నిధులు విడుదల చేశామని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నేషనల్ మిషన్ ఫర్ ఆయిల్ పాం పథకంలో భాగంగా జిల్లాలో రైతులకు సబ్సిడీపై ఆయిల్ పాం మొక్కలు అందజేయడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా 3 వేల హెక్టార్లలో ఎరువుల నిమిత్తం రైతుల బ్యాంకు ఖాతాలకు సీఎఫ్ఎంఎస్ ద్వారా జమ చేస్తారన్నారు. ఇప్పటి వరకు రూ.419 లక్షలు జమ అయినట్టు తెలిపారు. మామిడి, జీడిమామిడి, టిష్యూ కల్చర్, అరటి, కోకో తదితర పంటలకు సాగు చేసే రైతులకు రూ.28.5 లక్షలు సబ్సిడీ నిధులు విడుదల చేశారన్నారు. ఇప్పటి వరకు రూ18.87 లక్షలు సీఎఫ్ఎంఎస్ ద్వారా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం ద్వారా జిల్లాలో నెలకొల్పిన ఉద్యాన పంటల సేకరణ నిర్మాణానికి ఒక్కో సెంటరుకు రూ. 5.25 లక్షల చొప్పున విడులయ్యాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 15 కలెక్షన్ సెంటర్లకు రూ.78.75 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు.

కోట సత్తెమ్మకు విశేష పూజలు



నిడదవోలు, ఆగస్టు 4 : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు.అనంతరం అమ్మవారికి క్షీర నివేదన మహానివేదన చేశారు. ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి మొత్తం రూ.1,85,733లు ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్, కార్య నిర్వహణాధికారి వి.హరి సూర్య ప్రకాష్‌ఆలయ చైర్మన్ దేవులపల్లి రవి శంకర్ తెలిపారు.

మహిళలకూ హాస్టల్

- వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల ఏర్పాటు
- సీఎం ఆదేశాలతో కదలిక
- ఇప్పటికే రాజమహేంద్రిలో ఒకటి
- అందులో 50 మందికి వసతి
- విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం
- మహిళా ఉద్యోగినుల ఆనందం



రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 3 : పట్టణాలు, నగరాల్లో ఉద్యోగాలు చేసుకునే మహిళలకు వసతి గృహాలను ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు చేసిన ప్రకటనతో వర్కింగ్ ఉమెన్స్‌కు మరింత భద్రత ఏర్పడనుంది. ఎక్కడెక్కడి నుంచో పట్టణాలు, నగరాలకు వచ్చి చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకుని జీవించే ఎంతో మంది మహిళలకు సీఎం చేసిన ప్రకటన వరంగా మారనుంది. చాలీచాలని జీతాలతో వేల రూపాయలు చెల్లించి అద్దె భవనాల్లో ఉంటూ, అభద్రత నడుమ జీవించే పరిస్థితుల నుంచి బయటపడే మార్గం రాబోయే రోజుల్లో సుగమం కానుంది.

రాజమహేంద్రిలో ఎప్పటి నుంచో..

రాజమహేంద్రవరంలో ఎప్పటి నుంచో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నడుస్తోంది. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ పర్యవేక్షణలో ఉమెన్స్ కళాశాలకు ఎదురుగా కందుకూరి వీరేశలింగం సంస్థలకు చెందిన స్థలంలో నిర్వహిస్తున్నారు. హాస్టల్‌లో మొత్తం 16 గదులు ఉన్నాయి. ఒక్కో గదిలో ముగ్గురు చొప్పున ఇరుకిరుకుగా సర్దుకుంటున్నారు. వసతిగృహంలో చేరడానికి చాలా మంది వస్తున్నా గదుల కొరత కారణంగా కొత్తగా వచ్చేవారికి అవకాశం లేకుండా పోతోంది. ప్రస్తుతం ఈ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో 50 మంది ఉద్యోగినులు వసతి పొందుతున్నారు. వీరంతా ప్రైవేట్‌రంగంలో పనిచేస్తున్న ఉద్యోగినులే కావడం గమనార్హం. ప్రతి నెలా కొంత మొత్తాన్ని ఉదయం టిఫిన్, రెండు పూటలా భోజనం, ఇతర ఖర్చుల కు కేటాయించుకుని సొంత మెనూ ప్రకారం హాస్టల్ నిర్వహణ చేపడుతున్నారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారిణి పర్యవేక్షణలో ఒక సూపరింటెండెంట్ ఈ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ దైనందిన కార్యకలాపాలన్నింటినీ చూసుకుంటారు. అలాగే ఇక్కడ ఒక మేట్రిన్, వాచ్‌మెన్‌తో పాటు ఉద్యోగినులకు వంట చేయడానికి ఇద్దరు కుక్‌లను ప్రభుత్వమే నియమించింది.

నగరంలో డిమాండ్ ఎక్కువే..

రాజమహేంద్రవరంలో వేలాది మంది మహిళలు ఉద్యోగాలు చేస్తుంటారు. ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఉపాధి పొందుతారు. ఇటీవల అనేక చిన్న, పెద్ద పరిశ్రమలు రాజమహేంద్రవరం పరిసరాల్లో పెద్దసంఖ్యలో ఏర్పాటు కావడంతో వాటిలో పనిచేసే మహిళా ఉద్యోగినుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రైవేట్ ఆసుపత్రులు, మెడికల్ షాపులు, హోటళ్లు వంటి రంగాల్లోనూ విస్తృత సంఖ్యలో మహిళలు పనిచేస్తున్నారు. వీరందరికీ వసతి గృహాల కొరత తీవ్రంగా ఉంది. చాలా మంది ప్రైవేట్ హాస్టల్స్‌లో ఉంటూ ఉద్యోగాలు చేస్తున్నా అక్కడ సరైన భద్రత ప్రమాణాలు లేకపోయినా సర్దుకుపోతున్నారు. ఉద్యోగినులకు పెద్ద సంఖ్యలో వసతిగృహాలు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ప్రభుత్వం నుంచి రావడంతో జిల్లా అధికారుల్లోనూ కదలిక మొదలైంది.

కొత్త హాస్టల్‌కు ప్రతిపాదన..

ప్రస్తుత హాస్టల్ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో కొత్తగా మరో 16 గదులను నిర్మించాలనే ప్రతిపాదనలను జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారులు సిద్ధం చేసినట్టు సమాచారం. ప్రస్తుత భవనం యథాతథంగా ఉంచి కొత్త గదులు నిర్మిస్తే మరింత మందికి వసతి కల్పించవచ్చని భావిస్తున్నారు. ఉద్యోగినుల హాస్టల్స్‌కు ఉన్న డిమాండ్ మేరకు ప్రధాన రైల్వేస్టేషన్ లేదా కోటిపల్లి బస్టాండు ఏరియాలో కొత్తగా వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మిస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నాయకులు ప్రతిపాదిస్తున్నారు. అర్బన్ తహశీల్దార్ కార్యాలయం పక్కనే వసతిగృహానికి అనువైన ప్రభుత్వ స్థలం ఉందని సూచిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలమేరకు జిల్లా ఉన్నతాధికారులు ఎలాంటి ప్రతిపాదనలు సిద్ధం చేస్తారనేది వర్కింగ్ ఉమెన్స్‌లో చర్చనీయాంశంగా మారింది.

కొవ్వూరు ప్రభుత్వ మద్యం దుకాణంలో తనిఖీలు

సేల్స్ సూపర్‌వైజర్, సేల్స్‌మెన్‌లపై క్రమశిక్షణ చర్యలకు నివేదిక



మెరకవీధిలో మద్యంషాపులో తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

కొవ్వూరు, ఆగస్టు 4: ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేస్తున్న సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. కొవ్వూరు మెరకవీధి పెట్రోల్‌బంకు వద్ద మద్యం షాపులో సిబ్బంది షాపు మూసివేసిన తర్వాత క్వార్టర్ బాటిల్‌కు రూ.10 అదనంగా తీసుకుని కేసుల చొప్పన ప్రైవేటు వ్యక్తులకు విక్రయిస్తున్నారని వస్తున్న వార్తలపై ఆదివారం చాగల్లు డిపో ఎక్సైజ్ ఎస్‌ఐ వైవీవీ లక్ష్మణస్వామి, సిబ్బంది ఆర్.ఆంధ్రూస్ తనిఖీలు చేపట్టారు. లక్ష్మణస్వామి మాట్లాడుతూ మద్యం షాపులోని 9 రకాల బ్రాండ్‌లకు చెందిన 79 బాటిల్స్ తేడా వస్తున్నాయని, వాటి విలువ రూ.15,570 ఉంటుందన్నారు. దీనిపై సిబ్బందిని ప్రశ్నించగా బాటిల్స్‌పై లేబుల్స్ స్కాన్ అవ్వని కారణంగా మాన్యువల్‌గా విక్రయించామని చెప్తున్నారన్నారు. స్కాన్ అవ్వని బాటిల్స్ వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి మరలా లేబుల్స్ అంటించి విక్రయించాలన్నారు. అలా జరగని కారణంగా మద్యం షాపులో సేల్స్ సూపర్‌వైజర్ కె.సత్తిపండు, సేల్స్‌మేన్‌లు బి.రాహుల్, ఎస్.స్వామిలపై క్రమశిక్షణ చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. అలాగే కొవ్వూరు బస్టాండ్ సెంటర్ మద్యం షాపులో విధులు నిర్వహిస్తున్న చిన్నబాబు ఈ నెల 2వ తేదీ రాత్రి 9గంటల తర్వాత షాపుకు వచ్చి బీరు బాటిల్స్ ఎందుకు తీసుకెళ్లాడనే విషయమై ముగ్గురు చాగల్లు డిపోకు వచ్చి వివరణ ఇవ్వాలని సూచించామన్నారు. ఇదిలా ఉండగా కొవ్వూరులో బార్‌లలో సమయపాలన పాటించడం లేదని, అనధికారికంగా బెల్టు షాపులకు మద్యం విక్రయిస్తున్నారని వస్తున్న ఫిర్యాదులపై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఎస్‌ఐ లక్ష్మణస్వామి తెలిపారు.

సమాజహితమే సంస్కార భారతి లక్ష్యం

కొవ్వూరు, ఆగస్టు 4: సమాజ హితానికి అంకితభావంతో కృషిచేసే కళాకారుల, కళాభిమానుల సంఘటిత శక్తియే సంస్కార భారతి అని ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత ప్రచారక్ ఆదిత్య అన్నారు. కొవ్వూరులోని వేద సంస్కృత కళాశాలలో ఆదివారం సంస్కార భారతి రాష్ట్ర వార్షిక సమావేశం నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ 40 ఏళ్లుగా దేశ వ్యాప్తంగా సంస్కార భారతి కళా మాధ్యమాల ద్వారా సమాజహిత కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. రాష్ట్రంలో 9 జిల్లాల్లో శాఖలు ఉన్నాయని ఈ ఏడాది 26 జిల్లాల్లో సంస్కార భారతి వ్యాప్తి చెందేలా కృషి చేయాలన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్రాధ్యక్షుడు కృష్ణ, కార్యాధ్యక్షుడు టీఎస్‌వీ రమణమూర్తి, దక్షిణ క్షేత్ర ప్రముఖ్ శేఖర్, శ్రీనివాస్, కళాకారులు సప్ప దుర్గాప్రసాద్, చేగొండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాయనాడ్ మృతులకు శ్రద్ధాంజలి



వయనాడ్ మృతులకు కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటిస్తున్న క్రైస్తవులు

కొవ్వూరు, ఆగస్టు 4: కేరళ రాష్ట్రంలో ఇటీవల వాయనాడ్, చూర్‌మలా వద్ద కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతులకు కొవ్వొతులతో శ్రద్ధాంజలి ఘటించారు. జూలై 30న వాయనాడ్, చూర్‌మలా వద్ద కొండచరియలు విరిగిపడి 359 మంది మృత్యువాతపడ్డారు. ఆదివారం కొవ్వూరు మండలం వేములూరు దీప్తి పాఠశాలలో పునీత అస్సీసిపుర ఫ్రాన్సిస్ దేవాలయంలో కొవ్వొత్తులు వెలిగించి మృతుల ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించి నివాళులర్పించారు. ఫాదర్ పసల ఫ్రాన్సిస్ శాంతి ప్రార్థనలు చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కరస్పాండెంటు ఫాదర్ ప్రణయ్, వలియవీడు నెల్సన్ ఆంటోని, వీటీ విల్సన్‌రాజు, డి.జాన్, ఎస్.ప్రభాకర్, ఐ.శ్రీనివాస్, కిషోర్‌సింగ్, పి.రాజేష్, ప్రసాదరావు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక డ్రైవ్



ఎస్.ముప్పవరంలో మెయిన్‌డ్రైన్‌లో పూడిక తీస్తున్న దృశ్యం

చాగల్లు, ఆగస్టు 4: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మురుగు నిలిచిపోయిందని, ప్రజలు ఇబ్బంది పడకుండా నెల రోజులు పారిశుధ్య నిర్వహణ కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని డీఎల్‌పీవో అమ్మాజీ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మండలానికి ఒక ప్రొక్లెయినర్‌ను కేటాయించారు. ప్రధాన మురుగు కాలువల్లో పేరుకుపోయిన సిల్టుతో పాటు పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారు. ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ మహ్మద్ మెహబూబ్ అలీ ఆదివారం పనులను ప్రారంభించారు. పారిశుధ్య సిబ్బంది సహాయంతో వీధుల్లోని డ్రైన్లలో మురుగునీరు ప్రవహించేలా చర్యలు తీసుకుంటున్నారు. బహిరంగ ప్రదేశాలు, ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు తొలగించి స్థలాల యజమానులు పంచాయతీలకు సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థినికి స్కాలర్‌షిప్ అందజేత

దేవరపల్లి, ఆగస్టు 4: మండలంలోని త్యాజంపూడికి చెందిన వెంగల ఉమామహేశ్వరి జీఎస్‌ఎం కోర్సు చదువుతోంది. ఆమెకు పార్థ్‌ఇండియా సంస్థ ఆరేళ్లుగా స్కాలర్‌షిప్‌గా అందజేస్తోందని సంస్థ సభ్యులు దేవరాజు అచ్యుతరావు, సోమిశెట్టి వెంకట్రావు తెలిపారు. ఉమామహేశ్వరికి తల్లిదండ్రులు లేకపోవడంతో ఆమె చదువు కోసం ఆర్థిక సాయం అందిస్తున్నామని, ఈ క్రమంలో ఆదివారం స్కాలర్‌షిప్ అందజేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సత్యనారాయణ, బాబురావు, హేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా



గోపాలపురం శివారు తాడిపూడి ఉపకాల్వలో బోల్తా పడిన లారీ

గోపాలపురం, ఆగస్టు 4: మొక్కజొన్న లోడుతో ప్రయాణిస్తున్న లారీ శనివారం రాత్రి అదుపుతప్పి గోపాలపురం శివారులో ఉన్న తాడిపూడి ఉపకాల్వలో బోల్తా పడింది. వరంగల్ నుంచి మొక్కజొన్న లోడుతో దేవరపల్లి మండలంలోని ఒక పరిశ్రమకు వెళ్తుండగా మార్గమధ్యంలో ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికుల తెలిపారు. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్పగాయాలు కావడంతో కొయ్యలగూడెంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు.

మహిళ వైద్యానికి ఆర్థిక సాయం

తాళ్లపూడి, ఆగస్టు 4: మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పెద్దేవం శివారు చిడిపి గ్రామంలో ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న మిద్దే సత్యవతికి వైద్యం కోసం ఆర్థిక సాయం అందించామని అధ్యక్షుడు అంకెం సురేష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సనపల రాజశేఖర్, అప్పన హనుమంతరావు, గెడ్డం సాయిబాబా, పామెర్ల నగేష్ పాల్గొన్నారు.



శ్రీసూర్యనారాయణ మేలుకో...

శ్రీసూర్యనారాయణ మేలుకో... హరి సూర్యనారాయణ అన్నట్టుగా ఉంది కదూ... పెరవలి మండలం తీపర్రు గోదావరిలో ఆదివారం కనిపించిన సూర్యోదయ చిత్రమిది. మెల్లమెల్లగా సూరీడు బయటకు వస్తూ చూపరులకు కనువిందు చేశాడు. - పెరవలి



దారేది! అధ్వానంగా రహదారులు

గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మండలంలో రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయి. నిడదవోలు-కొయ్యలగూడెం రోడ్డు త్యాజంపూడి నుంచి పొంగుటూరు వరకు కనీసం ద్విచక్రవాహనాలు వెళ్లే పరిస్థితి కూడా లేదు. రోడ్డంతా పెద్దపెద్ద గుంతలు ఉండడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రోడ్లు వేయలేదు సరికదా కనీసం గుంతలు కూడా పూడ్చలేదు. ఈ గుంతల వల్ల నిడదవోలు-కొయ్యల గూడెం వెళ్లే ఆర్టీసీ, స్కూల్ బస్సులు, కార్లు, ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఈ రహదారుల్లో గుంతలు పూడ్చాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు. -దేవరపల్లి



కటకటాల పాలైన..కాపర్ వైరు దొంగలు

- తూర్పు, కాకినాడ జిల్లాలకు చెందిన 11 మంది అరెస్టు
- మినీ వ్యాన్, ఆటో, 420 కిలోల కాపర్ వైరు స్వాధీనం



కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు

కొవ్వూరు, ఆగస్టు 4: పంట పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ పగలుగొట్టి కాపర్ వైరు దొంగతనం చేస్తున్న 11 మందిని అరెస్టు చేసి వారి నుంచి ఒక మినీ వ్యాన్, ఆటో, రూ.2,40,000 విలువైన 420 కిలోల కాపర్ వైరు, దొంగతనాలకు వినియోగించిన పనిముట్లను స్వాధీనం చేసుకున్నట్టు కొవ్వూరు రూరల్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం కొవ్వూరు రూరల్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కొవ్వూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో 4 కేసులు, కొవ్వూరు టౌన్‌లో 2, తాళ్లపూడిలో 1, నల్లజర్లలో 3, చాగల్లులో 1, దేవరపల్లిలో 2, గోపాలపురంలో 1, రాజానగరంలో 2, కాకినాడ జిల్లా అన్నవరంలో 2 కేసులకు సంబంధించి 22 ట్రాన్స్‌ఫార్మర్‌లను పగలుగొట్టి దొంతనాలకు పాల్పడిన ఏడుగురిని, కాపర్ వైర్ కొనుగోలు చేసిన నలుగురు వ్యాపారస్తులను అరెస్టుచేసినట్టు చెప్పారు. కొవ్వూరు మండలం వేములూరుకు చెందిన సారిక సురేష్ తాపీ పనిచేస్తూ అప్పుడప్పుడు హైదరాబాద్ వెళ్లి వస్తుండేవాడు. హైదరాబాద్‌లో కాకినాడ జిల్లా పల్లా లోవరాజు, వేములూరుకు చెందిన తంపర సురేష్, సారిక దుర్గారావు, మట్టా శివ, మల్లిచెట్టు డోలానంద్, మంగిన అజిత్‌కుమార్, రేఖ సుధాకర్ ఒకేచోట తాపీపని పనిచేస్తుండేవారు. సారిక సురేష్ ఎలక్ట్రీషన్ పని నేర్చుకున్నాడు. ఖాళీ ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కడ ఉన్నాయో గుర్తించి వాటిలో రాగి వైరు అమ్ముకుంటే ఎక్కువ డబ్బులు సంపాదించుకోవచ్చునని ఎనిమిది మంది నిర్ణయించుకున్నారు. పలు పోలీసుస్టేషన్ల పరిధిలో రాత్రుళ్లు పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్‌లను పగలగొట్టి వాటిలోని కాపర్ వైరు వేరుచేసి పల్లా లోవరాజు వ్యాన్లో తీసుకొచ్చేవారు.అనంతరం కొవ్వూరు మండలం సీతంపేటలో జై హనుమంతు టింకరింగ్ షాప్‌లో నరమామిడి సత్యనారాయణ, కాకినాడ జిల్లా కిర్లంపూడిలో శ్రీ వెంకటదుర్గా ఆంజనేయ ట్రేడర్స్‌లో సరిక కృష్ణ, పెరవలి మండలం కాపవరంలో చింతలపూడి సత్యనారాయణకు, రాజమహేంద్రవరం లాలాచెరువు హౌసింగ్‌బోర్డులో బీఆర్ఎస్ ట్రైడర్స్‌లో పన్నెరు నందికేశవరావులకు చెందిన పాత ఇనుప సామాన్లు కొనే షాపుల్లో విక్రయించేవారు. ఇటీవల కొవ్వూరు మండలం చిడిపి గ్రామంలో పంట పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనానికి వెళ్తుండగా పోలీసులు కొవ్వూరు రూరల్, క్రైమ్ పోలీసులు దాడిచేసి ఏడుగురిని, ఆపై వైరు కొనుగోలు చేసిన నలుగురిని పట్టుకుని అరెస్టు చేశారు. ఈ కేసులో కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్, క్రైమ్ ఎస్ఐ కె.జగన్మోహనరావు, ఏఎస్ఐ జె.ధర్మరాజు, టి.శ్రీనివాసరావు, జి.అనీల్‌కుమార్, అఫ్సారీబేగ్, ఎస్.గణేష్, ఎస్కే వల్లీబాబు, హెచ్‌సీ జీఎస్ఆర్‌కే పరమహంసలను సీఐ అభినందించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న కాపర్‌వైర్

వ్యాను సీక్రెట్ అరలో గంజాయి

- 444 కిలోలు పట్టివేత
- దివాన్‌చెరువు జీరో పాయింట్ వద్ద తనిఖీ
- డీఎస్పీ అంబికా ప్రసాద్



వివరాలు వెల్లడిస్తున్న సౌత్‌జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 4: రాజమహేంద్రవరం జాతీయ రహదారి దివాన్‌చెరువు జీరో పాయింట్ వద్ద పోలీసులు గంజాయి తరలిస్తున్న వ్యాన్‌ను పట్టుకుని 443.860 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సౌత్ జోన్ డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చిన సమాచారంతో ఈనెల 3న సాయంత్రం దివాన్‌చెరువు వద్ద వ్యాన్‌ను తనిఖీ చేయగా అందులో 14 ప్లాస్టిక్ సంచుల్లో గంజాయి ఉందన్నారు. దీంతో వ్యాన్‌ను సీజ్ చేసి తమిళనాడు 8వ క్రాస్‌స్ట్రీట్ హౌసింగ్ బోర్డు, కురుంబాపేటకు చెందిన డ్రైవర్ దివాకర్‌ను అరెస్టు చేశామన్నారు. అతన్ని విచారించగా.. ఈనెల 3న దివాన్‌చెరువు వద్దకు వచ్చిన డ్రైవర్ దివాకర్, వ్యాన్ యజమాని కలిసి గండేపల్లి మండలం మురారి గ్రామం వెళ్లారని, అక్కడ మరో వ్యక్తితో కలిసి వ్యానులో జగ్గంపేట వెళ్లి జాతీయ రహదారిలో ఏజెన్సీ రోడ్డులోకి సుమారు 9 కిలోమీటర్లు వెళ్లాక దివాకర్‌ను అక్కడే ఉంచి మిగిలిన ఇద్దరూ అడవిలోకి వెళ్లారు. కొన్ని గంటల తర్వాత ఇద్దరూ వ్యాన్‌లో తిరిగొచ్చారు. జగ్గంపేట వచ్చాక ఆ ఇద్దరు దిగిపోయి వ్యాన్‌ను జాగ్రత్తగా తమిళనాడులో దిండివనం ప్రాంతానికి చేర్చమని దివాకర్‌కు చెప్పారు. జాతీయ రహదారిపై వ్యాను వస్తుండగా దివాన్ చెరువు వద్ద పట్టుకున్నామని, తనిఖీ చేయగా వ్యాన్ క్యాబిన్ వెనుక ఏర్పాటు చేసిన ప్రత్యేక అరలో గంజాయిని గుర్తించామని తెలిపారు. డ్రైవర్ దివాకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు. తనిఖీల్లో బొమ్మూరు సీఐ ఎండీ ఉమర్, సబ్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీను తదితరులు పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహకిషోర్ ఓ ప్రకటనలో మాట్లాడుతూ గంజాయి విక్రయం, వినియోగాన్ని నిరోధించడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, జిల్లా అంతటా స్పెషల్ డ్రైవ్‌లు, కార్డన్ సెర్చ్, వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. గంజాయి వల్ల కలిగే దుష్పరిణామాలపై హాస్టల్స్, పాఠశాల, కళాశాల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

వ్యాధి నిర్ధారణకు మైక్రోబయాలజీ మూలాధారం

- అంతర్జాతీయ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి
- జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో ముగిసిన ఐఎంఏ సదస్సు



నాగేశ్వర్‌రెడ్డిని సత్కరిస్తున్న డాక్టర్ గన్ని భాస్కరరావు, వైద్య ప్రముఖులు

రాజానగరం, ఆగస్టు 4: రానున్న ఐదేళ్లలో వ్యాధి నిర్ధారణ, చికిత్సలకు మైక్రోబయాలజీ మూలాధారం అవుతుందని అంతర్జాతీయ ప్రఖ్యాతి గాంచిన గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ పద్మభూషణ్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహించిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ)సౌత్‌జోన్ వైద్య విజ్ఞాన సదస్సు ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా వైద్య నిపుణులు నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ బాక్టీరియా గురించి చర్చించే మైక్రోబయాలజీ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా 100 సెంటర్లలో అధ్యయనాలు, పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. మన దేశంలో 6 కేంద్రాల్లో పరిశోధనలు జరుగుతుండగా అందులో ప్రైవేట్ రంగంలోని ఏకైక సంస్థ ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ(ఏఐజీ)కి చైర్మన్‌గా వ్యవహరిస్తున్నట్టు చెప్పారు. సహజ స్వాభావిక ఆహారం, అవసరమైన బాక్టీరియాను ఇవ్వడమే వ్యాధులకు భవిష్యత్తులో చికిత్స అవుతుందని వివరించారు. పేగుల్లో నివసించే వెయ్యి రకాల బాక్టీరియాల్లో హెచ్చుతగ్గులు రకరకాల వ్యాధులకు కారణమవుతున్నాయని చెప్పారు. ప్రధానంగా ఆహారంలో మార్పుల వల్లే బాక్టీరియాలో సమతూకం దెబ్బతిని రకరాల జబ్బులు, వ్యాధులు సంక్రమిస్తున్నాయని నాగేశ్వర్‌రెడ్డి వివరించారు. సహజ ప్రసవం ద్వారా పుట్టిన బిడ్డలు కనీసం ఆరు నెలలు తల్లి పాలు తాగిన బిడ్డలు, ఆరు నెలలలోపు యాంటీబయాటిక్స్ వాడని పిల్లల్లో మంచి బాక్టీరియా వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తడం లేదని ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అలాగే ఇంటి భోజనం చేసే వారికి, బయట జంక్‌ఫుడ్ తీసుకునే వారికి బాక్టీరియాల్లో తేడాలను ప్రయోగాల్లో తమ సంస్థ గమనించిందని చెప్పారు. మన వాతావరణానికి సరిపడే ఇడ్లీ, దోసె, పెరుగు మొదలైనవి తిన్నవారిలో కేన్సర్ నెమ్మదించిన అధ్యయనాలున్నాయని చెప్పారు. జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు ఇక్కడకు వచ్చిన ప్రతిసారి కొత్త అనుభవాలను ఇనుమడింపజేస్తున్నారని డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి ప్రశంసించారు. ఈ విభాగానికి డాక్టర్ వాడ్రేవు రవి(కాకినాడ), డాక్టర్ వీఎస్ఎస్ఎస్ మూర్తి(అమలాపురం) చైర్‌పర్సన్లుగా వ్యవహరించారు. డాక్టర్ వాణిమాధవి(జీఎస్ఎల్), డాక్టర్ పీఎస్ఎస్ శర్మ(అమలాపురం), డాక్టర్ సోమనాథ్ దాస్(జీఎస్ఎల్) ముగింపు సదస్సును నిర్వహించారు. అనంతరం డాక్టర నాగేశ్వర్ రెడ్డిని జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల యాజమాన్యం సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

మంత్రి దుర్గేష్‌ను కలిసిన జనసైనికులు



మంత్రి దుర్గేష్‌కు వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందిస్తున్న జనసైనికులు

తాళ్లపూడి, ఆగస్టు 4: జనసేన పార్టీ పెద్దేవం గ్రామాధ్యక్షుడు నామన చిన బూరయ్య ఆధ్వర్యంలో జనసైనికులు రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్‌ని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరస్వామి చిత్రపటానికి అందించి సత్కరించారు. కార్యక్రమంలో ముప్పనపల్లి వీరబాబు, గంగిరాజు దివాకర్, పి.వెంకటలక్ష్మి, బెంమూరి సతీష్ పాల్గొన్నారు.

డ్యాన్స్‌మాస్టర్స్, డ్యాన్సర్స్ అసోసియేషన్ సమావేశం

ధవళేశ్వరం, ఆగస్టు4: రిథమ్ ఆఫ్ ఆంధ్ర డ్యాన్స్ మాస్టర్స్ అండ్ డ్యాన్సర్స్ అసోసియేషన్ జిల్లా స్థాయి సమావేశం ఆదివారం స్థానిక జ్యోషి డ్యాన్స్ అకాడమీలో నిర్వహించారు. సంఘం ద్వారా డ్యాన్సర్స్‌కు అవసరమైన సేవలు అందించడానికి కృషి చేస్తామని అసోసియేషన్ సభ్యులు అన్నారు. ఈ సందర్భంగా పలువురు డ్యాన్సర్‌లు మాట్లాడుతూ తాము ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు.

శాకంబరిగా నాగారమ్మ



ఉండ్రాజవరం: పాలంగిలో శాకంబరి అలంకరణలో బాలాత్రిపురసుందరి

చాగల్లు, ఆగస్టు 4: మండలంలోని బ్రాహ్మణగూడెం గ్రామదేవత నాగారమ్మ ఆదివారం భక్తులకు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢమాసం ముగింపు సందర్భంగా గ్రామ ముత్తయిదువులు అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు. సారె, చీర కావిళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్థులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించింది.

ఉండ్రాజవరం: మండలంలోని పాలంగి రామలింగేశ్వరస్వామి ఆలయంలో బాలాత్రిపురసుందరికి ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారిని వివిధ కూరగాయలతో అలంకరించారు. ఆలయార్చకుడు వి.రఘు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

పెరవలి: తీపర్రులో గ్రామ దేవత చింతాలమ్మకు పలువురు మహిళలు చీర, సారె పెట్టారు. వివిధ రకాల స్వీట్లు, పండ్లు అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామంలోని ఆడపడుచులు, కోడళ్లు పాల్గొన్నారు.



పెరవలి: తీపర్రులో చింతాలమ్మకు భక్తులు సమర్పించిన సారె

రైలులో ప్రసవం

రాజమహేంద్రవరంలో అప్రమత్తమైన జీఆర్పీ పోలీసులు

ఆసుపత్రికి తరలింపు.. తల్లీబిడ్డ క్షేమం



హీరాకు రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో వైద్యం అందిస్తున్న వైద్యులు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 4: బొకారో ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేస్తున్న నిండు గర్భిణి రాజమహేంద్రవరంలో గోదావరి బ్రిడ్జి సమీపంలోకి రైలు వచ్చేసరికి బోగిలోనే ప్రసవించింది. జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. బీహార్‌కు చెందిన అమరజీత్ రామ్ అతని భార్య హీరాకుమారి జీవనోపాధి నిమిత్తం కోయంబత్తూరులో ఉంటున్నారు. ఈ క్రమంలో గర్భవతిగా నెలలు నిండిన హీరాను బీహార్ తీసుకెళ్లడానికి ఈనెల 3న బోకారో ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరారు. రైలు రాజమహేంద్రవరం గోదావరి బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి హీరాకు పురిటినొప్పులు వచ్చి వెంటనే మగ బిడ్డను జన్మనిచ్చింది. ఈ సమాచారం సీఐ విజయశంకర్‌కు తెలియడంతో ఆయన స్పందించి రైలు రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌కు వచ్చేసరికి రైల్వే వైద్యులను జీఆర్పీ సిబ్బందిని అప్రమత్తం చేశారు. స్టేషన్‌కు రైలు రాగానే తల్లీబిడ్డను కిందకు దింపించి స్టేషనల్‌లో హెల్త్ చెకప్ చేయించి ఆపై 108 అంబులెన్స్ ద్వారా రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్టు వైద్యులు చెప్పారని విజయశంకర్ తెలిపారు.

ఎస్పీ కిశోర్‌కు స్నేహితుల శుభాకాంక్షలు



ఎస్పీకి స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్న మిత్రులు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 5: జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్‌ను ఆయన స్నేహితులు కలిసి స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు చెప్పారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చిన మిత్రులు ఆయన్ను కలిశారు. వారంతా శ్రీకాకుళంలో గురజాడ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో 1993-94లో బీఈడీ చదువుకున్నారు. ఆలనాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. కొద్దిసేపు ఆనందంగా మాట్లాడుకున్నారు. కాగా ఎస్పీని కలిసిన రవికుమార్, దేవానంద్, చంద్రరావు, రాంబాబు, రాజారావు ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లాలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. అలాగే నగరంలో చాలా మంది స్నేహితులు దూరప్రాంతాల్లో ఉన్నవారు తమ స్నేహబంధాన్ని గుర్తుచేసుకుని ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్ వేదికగా స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

ప్రారంభానికి సిద్ధంగా కమ్యూనిటీ హాల్



కమ్యూనిటీ హాల్‌కు రంగులు వేస్తున్న దృశ్యం

గోపాలపురం, ఆగస్టు 4: గోపాలపురంలోని ఉప్పరగూడెంలో శిథిలావస్థకు చేరిన ఎస్సీ సామాజిక భవనాన్ని పునఃనిర్మాణం చేసేందుకు మండల పరిషత్ నిధులు రూ.4లక్షలతో పనులు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో శిథిలావస్థకు చేరిన ఈ కమ్యూనిటీ హాల్‌కు కొత్తహంగులు దిద్దుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉంది. అలాగే గ్రామంలోని ఎస్సీ ప్రాంతంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కల్వర్టుతో పాటు సిమెంటు రోడ్డును పంచాయతీ నిధులు రూ.4లక్షలతో పునఃనిర్మించారు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులు చకచక జరుగుతున్నాయంటూ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

సీతానగరం, ఆగస్టు 4: మండలంలోని పెదకొండేపూడిలో ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన కారింకుల కొండయ్య (40) స్థానికంగా ఓ కోళ్లఫారంలో పనిచేస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున కోళ్లను వ్యాన్‌లో లోడింగ్ చేస్తుండగా ఫారంలో తెగిపడివున్న విద్యుత్ వైరు తగిలి మృతి చెందాడు. ఎస్ఐ టి.రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కాగా కొండయ్యకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

